గౌతమ్ న్యూస్ తెలుగు దిన పత్రిక
రిపోర్టర్స్ కావలెను.
GTV GAUTHAM NEWS
9441735522
9849440951
అనతి కాలంలోనే విశేష ప్రజాదరణ పొందుతున్న గౌతమ్ న్యూస్ తెలుగు దినపత్రికకు మరియు Gtv లో పని చేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు, ఆర్ సీ ఇంఛార్జీలు, మండల విలేకరులు కావలెను.


# గౌతమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక


ప్రతి క్షణం ప్రజల కోసం...
24 X 7
GTV GAUTHAM NEWS
Voice of Truth...
GAUTHAM NEWS TV



హైదరాబాద్ సంపుటి : 01 సంచిక : 125, ఎడిటర్,భీముడు నాయక్ పేజిలు : 12, వెల రూ. 1, సోమవారం - 10- జూన్ - 2024
PUBLISHED FROM HYDERABAD, CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



## అల్టిమేట్ ఫైటింగ్ చాంపియన్‌షిప్‌లో పూజ సెన్సేషన్..

**తొలి భారతీయురాలిగా రికార్డ్**

యూఎఫ్‌సీలో బ్రెజిల్ క్రీడాకారిణి రయానేపై విజయం

యూఎఫ్‌సీలో భారత్‌కు ఇదే తొలి విజయం

2లో



## స్మృతివనం వద్ద రామోజీకి వీడ్కోలు..

కన్నీటితో సాగనంపిన కుటుంబ సభ్యులు

హాజరైన ప్రముఖులు, అభిమానులు

వందలాదిగా తరలివచ్చిన రామోజీ సంస్థల ఉద్యోగులు

రామోజీ పార్థివదేహానికి గౌరవ వందనం

## కెనడాలో ఇందిరాగాంధీ హత్య పోస్టర్లు..

**ఖండించిన ట్రూడో ప్రభుత్వం**



2

- వాంకూవర్‌లో ఇందిరా గాంధీ హత్య పోస్టర్ల ఏర్పాటు
- ఈ చర్యను ఖండించిన కెనడా మంత్రి
- హింసను ప్రేరేపించే చర్యలను ఏమాత్రం ఆమోదించబోమని ప్రకటన
- హిందువుల్లో భయోత్పాతం కలిగించేందుకే ఈ చర్య అన్న చట్టసభ సభ్యుడు చంద్ర ఆర్య

## దగా చేయడం మంచిది కాదు.. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



2లో

- రూ.500 బోనస్‌పై కాంగ్రెస్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి
- సన్నరకం వడ్లకే బోనస్ ఇస్తామని చెప్పడం సరికాదు
- అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలని అసెంబ్లీ సమావేశాల్లో నిలదీస్తాం
- ఆయిల్ ఫామ్ పంట లాభదాయకం

# మెగా డీఎస్సీపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు

మెగా డీఎస్సీపై చంద్రబాబు మొదటి సంతకం, విద్యాశాఖ కసరత్తు?

13 నుంచి 15 వేల ఉపాధ్యాయ పోస్టులతో నోటిఫికేషన్!

పాత నోటిఫికేషన్ లో పోస్టులు

ఏపీలో 39 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ



వివరాలు 2లో..

అమరావతి: మెగా డీఎస్సీపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ రద్దు చేయనున్నట్లు సమాచారం. ఎన్నికల ప్రచార సభల్లో టీడీపీ అధినేత చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీపై మొదటి సంతకం ఎప్పుడు చేస్తారని నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు. సాధారణంగా మొదటి సంతకం ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే చేస్తారు. చంద్రబాబు ఈనెల 12న ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆ రోజే మెగా డీఎస్సీపై మొదటి సంతకం చేస్తారని అందరూ భావిస్తున్నారు. రాష్ట్రంలో ఇప్పటికే గత ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్ ను రద్దు చేసే యోచనలో విద్యాశాఖ ఉంది.

## అమరావతిలో కొత్త కళ.. రాజధాని నిర్మాణం పనులు పునఃప్రారంభం



2

- రకరకాల పిచ్చి మొక్కలతో నిండిపోయిన అమరావతి ప్రాంతం
- యుద్ధ ప్రాతిపదికన జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టిన అధికారులు

## తనకు లోక్ సభ స్పీకర్ పదవి అంటూ ప్రచారంపై పురందేశ్వరి స్పందన



2లో

- కేంద్ర క్యాబినెట్ లో ఏపీకి సరైన ప్రాతినిధ్యం లభించింది
- శ్రీనివాసవర్మ వంటి నిజమైన కార్యకర్తకు కేంద్ర మంత్రి పదవి లభించిందని హర్షం
- లోక్ సభ స్పీకర్ పదవి గురించి అడిగితే... రెండు చేతులు జోడించిన పురందేశ్వరి

# విపక్ష నేతగా రాహుల్


సీడబ్ల్యూసీ ఏకగ్రీవ తీర్మానం.. సమయం కావాలన్న అగ్ర నేత

ఫలితాలు మోదీకి నైతిక ఓటమి

మరో తీర్మానానికి ఏకగ్రీవ ఆమోదం

కాంగ్రెస్ ప్రదర్శన బాగుందంటూ కితాబు

రాణించని రాష్ట్రాల్లో దిద్దుబాటుకు కమిటీలు



వివరాలు 2లో..

న్యూఢిల్లీ: లోక్‌సభలో విపక్ష నేతగా రాహుల్‌గాంధీ బాధ్యతలు స్వీకరించాలని కాంగ్రెస్ అత్యున్నత నిర్ణాయక విభాగమైన వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) కోరింది. పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే సారథ్యంలో శనివారం ఢిల్లీలో జరిగిన సీడబ్ల్యూసీ సమావేశం ఈ మేరకు ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. అయితే తనకు కాస్త సమయం కావాలని ఈ బాధ్యత స్వీకరించే విషయమై అతి త్వరలో నిర్ణయం తీసుకుంటానని రాహుల్ చెప్పారు. ఖర్గే, రాహుల్‌తో పాటు సోనియాగాంధీ, ప్రియాంకా గాంధీ వద్రా, కేసీ వేణుగోపాల్, డీకే శివకుమార్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తదితరులు భేటీలో పాల్గొన్నారు. 32 మంది సీడబ్ల్యూసీ సభ్యులు, 26 మంది శాశ్వత ఆహ్వానితులు, 12 మంది ప్రత్యేక ఆహ్వానితులు, 29 మంది పీసీసీ అధ్యక్షులు, 18 మంది సీఎల్పీ నేతలతో పాటు మరో 35 మంది వీరిలో ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై భేటీ ప్రధానంగా చర్చించింది. "రాజ్యాంగ పరిరక్షణకు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు కల్పించిన

## నైతిక, రాజకీయ ఓటమి...



2లో

మోదీకి గద్దెనెక్కే హక్కు లేదు

సోనియా మండిపాటు

సీపీపీ ఛైర్‌పర్సన్‌గా ఎన్నిక

## అటు కేరళ.. ఇటు ఉత్తర ప్రదేశ్

- వయనాడ్‌కే రాహుల్ గాంధీ టాటా!..
- వచ్చేవారం రాయ్ బరేలీలో సోనియా కుటుంబం పర్యటించనుంది
- జూన్ 17వ తేదీలోపు దీనిపై స్పష్టమైన ప్రకటన





2లో

ఢిల్లీ: లోక్ సభ ఎన్నికలలో యూపీలోని రాయ్‌బరేలీ, కేరళలోని వయనాడ్ నుంచి మూడు లక్షల పైచిలుకు మెజారిటీ గెలుపు సాధించిన రాహుల్ గాంధీ.. రూల్స్ ప్రకారం ఏదో ఒక సీటును వదులుకోవాల్సిన పరిస్థితి. అయితే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ భేటీలో ఈ అంశం కూడా చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం..

## ఈ తరహా దాడులు పిరికిపందల చర్య..

# ఇవి నీచ రాజకీయాలు

రాష్ట్రంలో కొనసాగుతున్న టీడీపీ శ్రేణుల అరాచకాలపై సర్వత్రా ఖండనలు

మహానేత వైఎస్సార్ విగ్రహాలను సైతం ధ్వంసం


ప్రజాస్వామ్యంలో ఇలాంటి అరాచకాలు జరగడం అత్యంత దారుణం, మిక్కిలి శోచనీయం...



వివరాలు 2లో..

విజయవాడ: రాష్ట్రంలో కొనసాగుతున్న టీడీపీ శ్రేణుల అరాచకాలపై సర్వత్రా ఖండనలు వినిపిస్తున్నాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మీద ఈర్ష్య, అసూయలతో ఆయన పాలనకు సంబంధించిన ఆనవాళ్లేవీ ఉండకూడదని పచ్చ మూకలు దాడులకు తెగపడుతోంది. ఈ క్రమంలో మహానేత వైఎస్సార్ విగ్రహాలను సైతం ధ్వంసం చేస్తున్నాయి. అయితే ఈ పరిణామాలపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్స్ వేదికగా ఆమె ఈ దాడుల్ని ఖండిస్తూ ఓ సందేశం ఉంచారు. "రాష్ట్రంలో మహానేత వైఎస్సార్ విగ్రహాలపై అల్లరి మూకలు చేస్తున్న వికృత దాడులను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది. ప్రజాస్వామ్యంలో ఇలాంటి అరాచకాలు జరగడం అత్యంత దారుణం, మిక్కిలి శోచనీయం... ఎటువంటి పరిస్థితుల్లోనూ ఇలాంటి రౌడీ చర్యలు ఖండించి తీరాల్సిందే. ఇది పిరికిపందల చర్య తప్ప మరొకటి కాదు. తెలుగువాళ్ళ గుండెల్లో గూడుకట్టుకున్న వైఎస్సార్ విశేష ప్రజాదరణ పొందిన నాయకులు.

## భారత్ నుంచి ఆస్ట్రేలియాకు బర్డ్‌ఫ్లూ కేసు-డబ్ల్యూహెచ్‌వో



ఆ చిన్నారికి బర్డ్‌ఫ్లూ భారతదేశం నుంచే వచ్చిందని చెబుతోంది డబ్ల్యూహెచ్‌వో

చిన్నారి కుటుంబం కొలకత్తాకు

బర్డ్‌ఫ్లూ వైరస్ లక్షణాలతో ఆసుపత్రిలో జాయిన్ అయిన బాలుడు రెండు వారాల చికిత్స అనంతరం డిశ్చార్జ్

అక్కడి ప్రభుత్వం, పక్షులు, పౌల్ట్రీకి సంబంధించిన ఎగుమతులను నిలిపివేస్తూ నిర్ణయం

## అల్టిమేట్ ఫైటింగ్ చాంపియన్‌షిప్‌లో పూజ సెన్సేషన్..
### తొలి భారతీయురాలిగా రికార్డ్

ఢిల్లీ: అల్టిమేట్ ఫైటింగ్ చాంపియన్‌షిప్ (యూఎఫ్‌సీ)లో బ్రెజిల్‌కు చెందిన రయానే డోస్ శాంతోస్‌ను ఓడించిన భారత్‌కు చెందిన పూజా తోమర్ చరిత్ర సృష్టించింది. యూఎఫ్‌సీని గెలుచుకున్న తొలి భారత క్రీడాకారిణిగా రికార్డులకెక్కింది. ఉత్తరప్రదేశ్‌లోని ముజఫరాబాద్‌కు చెందిన పూజ.. యూఎఫ్‌సీ కాంట్రాక్ట్ సొంతం చేసుకున్న తొలి ఇండియన్‌గా గతేడాదే రికార్డు సొంతం చేసుకుంది. ఇప్పుడు చాంపియన్‌గా నిలిచి అత్యంత అరుదైన రికార్డును తన పేరుపై రాసుకుంది. స్ట్రావెయిట్ డివిజన్‌లో రయానేపై 30-27, 27-30, 29-28 తేడాతో విజయం సాధించింది. తొలి రౌండ్‌లో దూకుడు ప్రదర్శించిన పూజ, రెండో రౌండ్‌లో కొంత వెనుకబడినప్పటికీ మూడో రౌండ్‌లో పుంజుకుని ప్రత్యర్థిని చిత్తుచేసి విజయాన్ని అందుకుంది. పూజ తన విజయాన్ని ఇండియన్ ఫైటర్లు, అభిమానులకు అంకితమిచ్చింది. ఇండియన్ ఫైటర్స్ అంటే ఓటమి చెందేవాళ్లు కాదని నిరూపించాలనుకున్నానని పూజ పేర్కొంది. ఈ విజయం తన ఒక్కరిదే కాదని, భారత అభిమానులు, ఇండియన్ ఫైటర్స్‌ది అని పూజ వివరించింది.

## స్మృతివనం వద్ద రామోజీకి వీడ్కోలు..

హైదరాబాద్: రామోజీరావు అంత్యక్రియలు ముగిశాయి. రామోజీ ఫిల్మ్ సిటీలోని స్మృతి వనం వద్ద రామోజీరావుకు కుటుంబ సభ్యులు, బంధువులు, ప్రముఖులు కడసారి వీడ్కోలు పలికారు. రామోజీరావు కుమారుడు కిరణ్ అంతిమ సంస్కారాలు నిర్వహించారు. అధికారిక లాంఛనాల మధ్య, పోలీసుల గౌరవ వందనంతో రామోజీ అంత్యక్రియలు పూర్తయ్యాయి. రామోజీ అభిమానులు, సినీ, రాజకీయ ప్రముఖులు ఆయనకు కన్నీటితో వీడ్కోలు పలికారు. అంత్యక్రియలకు రామోజీ సంస్థల ఉద్యోగులు వందలాదిగా తరలివచ్చారు. అంతిమ సంస్కారాల్లో కిషన్ రెడ్డి, బండి సంజయ్, నారా లోకేశ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, నామా నాగేశ్వరరావు, వి.హనుమంతరావు, కేఆర్ సురేశ్ రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, సుజనా చౌదరి, జూపల్లి కృష్ణారావు, అరికెపూడి గాంధీ, వెనిగండ్ల రాము తదితరులు పాల్గొన్నారు.

## కెనడాలో ఇందిరాగాంధీ హత్య పోస్టర్లు..
### ఖండించిన ట్రూడో ప్రభుత్వం

ఢిల్లీ : కెనడాలో ఖలిస్థానీ వేర్పాటువాదులు వాంకూవర్ నగరంలో ఇందిరా గాంధీ హత్య తాలూకు పోస్టర్లు ఏర్పాటు చేయడం కలకలానికి దారి తీసింది. ఈ చర్యలను కెనడా ప్రభుత్వం ఖండించింది. హింసను ప్రోత్సహించడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేసింది. ఈ మేరకు ఎక్స్ వేదికగా కెనడా మంత్రి డామినిక్ ఏ లెబ్లాంక్ స్పందించారు. "వాంకూవర్ లో కొందరు ఇందిరా గాంధీ హత్య పోస్టర్లు ఏర్పాటు చేశారు. కెనడాలో ఇలా హింసను ప్రోత్సహించడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు" అని పేర్కొన్నారు. 1984లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీని ఆమె బాడీ గార్డులు కాల్చి చంపేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై భారత సంతతికి చెందిన చట్టసభ సభ్యుడు చంద్ర ఆర్యా కూడా స్పందించారు. " వాంకూవర్ లోని ఖలిస్థానీ మద్దతుదారులు ఇందిరా గాంధీ హత్య పోస్టర్లను ఏర్పాటు చేశారు. హిందూ కెనేడియన్లలో భయోత్పాతం కలిగించేందుకు ఈ చర్యకు పూనుకున్నారు. గత ఏడాది బ్రాంప్టన్ లో జరిగిన ఘటనల కొనసాగింపే ఈ బెదిరింపు. హిందువులు ఇండియాకు వెళ్లాలంటూ వేర్పాటువాది పన్నున్ కొన్ని నెలల క్రితం హెచ్చరించాడు. ఇలాంటి చిత్రాల ప్రదర్శన చివరకు హింసకు దారి తీసే అవకాశం ఉంది" అని పేర్కొన్నారు. సిక్కు వేర్పాటు వాద సంస్థ సిక్స్ ఫర్ జస్టిస్‌కు పన్నున్ ప్రతినిధిగా, న్యాయసలహాదారుగా వ్యవహరిస్తున్నాడు. ప్రత్యేక సిక్కు రాష్ట్రమే లక్ష్యంగా పనిచేస్తున్న ఈ సంస్థపై భారత్ నిషేధం విధించింది. వేర్పాటువాదులు, ఉగ్రవాదులు, భారత వ్యతిరేక శక్తులకు కెనడా అడ్డాగా మారిందని భారత ప్రభుత్వం గతంలో పలుమార్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.

## అమరావతిలో కొత్త కళ..
### రాజధాని నిర్మాణం పనులు పునఃప్రారంభం

అమరావతి: ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో అమరావతి ప్రాంతంలో మళ్లీ సందడి మొదలైంది. దట్టమైన ముళ్లకంపలు, పిచ్చి చెట్లు, పొదలతో చిట్టడవిలా మారిన అమరావతిలో సీఆర్డీఏ అధికారులు జంగిల్ క్లియరెన్స్ పనులు చేపడుతున్నారు. రాజధాని నిర్మాణ పనులు పునఃప్రారంభమైన నేపథ్యంలో భారీ సంఖ్యలో పొక్లెయిన్లు, జేసీబీలను రప్పించి ఎక్కడికక్కడ మళ్లీ కంపలను తొలగించి శుభ్రం చేస్తున్నారు. ఐఏఎస్ అధికారులు, ఉద్యోగుల బహుళ అంతస్తుల భవనాలు, జ్యుడిషియల్ క్వార్టర్స్, ప్రభుత్వ టైప్ - 1, టైప్- 2 భవనాలు, శాశ్వత రాజధాని నిర్మాణ పనులలో భాగమైన జీఏడీ మెగా టవర్లు అన్నీ పిచ్చి చెట్లతో కమ్మేసుకున్నాయి. 12న చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తున్న నేపథ్యంలో రాజధానిలో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపడుతున్నారు. విజయవాడ నుంచి అమరావతిలోకి ప్రవేశించే కరకట్ట రోడ్డు, అత్యంత ప్రధానమైన సీడ్ యాక్సెస్ రోడ్డు, హైకోర్టు నుంచి తూళ్లూరుకు వెళ్లే రోడ్డు, అమరావతి రాజధాని మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా నిర్మించిన రోడ్లు, ఐఏఎస్ అధికారులు, ఉద్యోగుల బహుళ అంతస్తుల భవనాల సమీపంలో భారీగా విస్తరించిన ముళ్లకంపలను తొలగించే కార్యక్రమాన్ని సీఆర్‌డీఏ చేపట్టింది. శాశ్వత రాజధాని నిర్మాణ పనులలో భాగంగా నిర్మిస్తున్న గ్యాడ్ టవర్లు చెరువులను తలపించేలా ఉండటంతో వాటిల్లోని నీటిని తోడేందుకు మోటార్లను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. అయితే, అమరావతిలోని పిచ్చి చెట్లను తొలగించేందుకు వారం పడుతుందని సమాచారం. దుమ్ముధూళితో నిండిపోయిన ఎక్స్‌పీరియన్స్ సెంటర్ తాళాలు తెరిచి బూజు దులుపుతున్నారు. ఈ సెంటర్ నలువైపులా విస్తరించి ఉన్న పొదలను తొలగిస్తున్నారు. రాజధానిలో విద్యుత్ తీగలను భూగర్భంలో ఏర్పాటు చేసిన నిర్మాణాలు ఎక్కడ ఉన్నాయో తెలియనంతగా పిచ్చి చెట్లు విస్తరించాయి. వాటిని తొలగించి అన్నీ బయటకు కనిపించేలా చేస్తున్నారు. ఉద్దండ్రాయునిపాలెంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అమరావతికి శంకుస్థాపన చేసిన ప్రాంతాన్ని శుభ్రం చేస్తున్నారు. సీఆర్డీఏ కమిషనర్ వివేక్ యాదవ్ ఈ పనులను పర్యవేక్షిస్తున్నారు. శుక్రవారం నుంచి ఈ పనులు జరగనున్నాయి.

## తనకు లోక్ సభ స్పీకర్ పదవి అంటూ ప్రచారంపై పురందేశ్వరి స్పందన

కేంద్ర మంత్రివర్గ కూర్పుపై ఏపీ బీజేపీ చీఫ్, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి స్పందించారు. కేంద్ర క్యాబినెట్ కూర్పు చక్కగా, ఏపీ నుంచి సరైన ప్రాతినిధ్యం లభించిందని, ముగ్గురికి కేంద్ర మంత్రి పదవులు ఇచ్చారని పురందేశ్వరి హర్షం వ్యక్తం చేశారు. నరసాపురం ఎంపీ భూపతిరాజు శ్రీనివాసవర్మకు క్యాబినెట్ లో చోటు లభించడం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. కార్యకర్తగా కష్టపడి పనిచేస్తున్న ఒక వ్యక్తిని గుర్తించి టికెట్ ఇవ్వడం నుంచి, ఇవాళ అతడిని కేంద్ర క్యాబినెట్ లోకి తీసుకోవడం వరకు ప్రతి బీజేపీ కార్యకర్తకు ఎంతో ఉత్తేజం కలిగించే అంశమని తెలిపారు. "ఏపీలో మేం కూటమిగా పోటీ చేశాం. కేంద్ర క్యాబినెట్ కూర్పు నేపథ్యంలో, టీడీపీ వాళ్లు రెండు పేర్లు ఇచ్చారు... వారిని మంత్రివర్గంలోకి తీసుకోవడం జరిగింది. మొదటి నుంచి బీజేపీ కార్యకర్తగా అంకితభావంతో పనిచేస్తున్న భూపతిరాజు శ్రీనివాసవర్మను కూడా క్యాబినెట్ లోకి తీసుకున్నారు. ఇప్పుడు ఏపీ నుంచి కేంద్రమంత్రులుగా అవకాశం దక్కించుకున్న వాళ్లు కచ్చితంగా రాష్ట్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ముందుకు సాగుతారు. ఏపీకి నిధులు సాధించడానికి వీరంతా తమ వంతు కృషి కచ్చితంగా చేస్తారు. అభివృద్ధికి డబుల్ ఇంజిన్ సర్కారు ఎంతో అవసరం. ఇక్కడ కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఉంది, రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఉంది. గడచిన ఐదేళ్లలో రాష్ట్రం ఏ విధంగా కుంటుపడిందో, ఏ విధంగా నిర్లక్ష్యానికి గురైందో... ఆ లోటును అధిగమించేందుకు పెద్ద ఎత్తున వనరులు తెచ్చుకోవడం, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు అవకాశం ఉంటుంది" అని పురందేశ్వరి వివరించారు. ఇక, మీకు లోక్ సభ స్పీకర్ పదవి ఇవ్వనున్నారట కదా అనే ప్రశ్నకు పురందేశ్వరి మౌనంతోనే సమాధానమిచ్చారు. మీడియా రిపోర్టర్ రెండుసార్లు ఈ ప్రశ్న అడగ్గా, ఆమె రెండు సార్లు చేతులు జోడించి "నమస్కారం" అనే రీతిలో నవ్వుతూ ముందుకు వెళ్లిపోయారు.

## దగా చేయడం మంచిది కాదు..
### ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

హైదరాబాద్: వానాకాలం వచ్చినా రైతుల పంట పెట్టుబడి సాయంపై ప్రభుత్వం నోరు మెదపడం లేదని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు అన్నారు. పంట సాగు కంటే ముందే ఎకరాకు ఇస్తామన్న రూ.7500 వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లాలో ఆయిల్‌పామ్ ఆయిల్‌పామ్ తొలి పంటను ఆదివారం నాడు రైతులు తీశారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం అక్కెనపల్లిలోరైతు నాగేందర్ కోరిక మేరకు మొదటి పంటను మాజీ మంత్రి హరీశ్‌రావు కోశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. క్రాప్ మెయింటెనెన్స్ కింద ప్రభుత్వం రైతుకు ఏడాదికి రూ.4200 ఇవ్వాలన్నారు. ప్రభుత్వ సహకారం లేకపోవడంతో పామాయిల్ పంటపై రైతులు ఆసక్తి చూపించడం లేదని హరీశ్‌రావు అన్నారు. ప్రభుత్వం రైతులకు ఇస్తామన్న రైతు భరోసా నిధులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. పచ్చిరొట్ట, జిలుగ, జనుము విత్తనాల సరఫరా చేయని దుస్థితి ఈ రాష్ట్ర ప్రభుత్వానిది అని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చూసిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రకాల పంటలకు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు ఇవ్వాల్సిన నిదులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని.. దగా చేయడం మంచిది కాదని హితవు పలికారు.

## ఈ తరహా దాడులు పిరికిపందల చర్య..
### ఇవి నీచ రాజకీయాలు

మొదటి పేజి తరువాయి

తెలుగు ప్రజల హృదయాల్లో ఆయనది చెరపలేని ఒక జ్ఞాపకం. అటువంటి నేతకు నీచ రాజకీయాలు ఆపాదించడం సరికాదు, గెలుపు ఓటములు ఆపాదించడం తగదు. వైఎస్సార్‌ను అవమానించేలా ఉన్న ఈ హీనమైన చర్యలకు.. బాధ్యులైన వారిపై వెనువెంటనే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది" అని సందేశం ఉంచారామె. మరోవైపు.. ఏపీలో టీడీపీ శ్రేణుల దాడుల్ని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు పల్లంరాజు ఖండించారు. ఇలాంటి దాడులు ప్రజాస్వామ్యానికి మంచిది కాదని అన్నారాయన.

# మెగా డీఎస్సీపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు

మొదటి పేజి తరువాయి



దాని స్థానంలో కొత్త డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసేందుకువిద్యా శాఖ కసరత్తు ప్రారంభించింది. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తరువాత మొట్టమొదటి సంతకం మెగా డీఎస్సీ ఫైలుపైనే చేయనున్నట్లు ఇప్పటికే అధికార వర్గాలకు సమాచారం అందింది. దానికి సంబంధించిన ఏర్పాట్లు సత్వరమే పూర్తి చేయాలని విద్యాశాఖకు ఆదేశాలు అందించారు.

### 13 నుంచి 15 వేల ఉపాధ్యాయ పోస్టులతో నోటిఫికేషన్!

బుధవారమే చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉండటంతో విద్యా శాఖ అప్రమత్తమైంది. ఖాళీ పోస్టుల వివరాలు పంపాలని ఇప్పటికే సంబంధిత అధికారులకు మౌఖిక ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రస్తుతం విడుదలైన నోటిఫికేషన్ లో 6,100 పోస్టులు ఉన్నాయి. అయితే తాజాగా 13 నుండి 15 వేల ఉపాధ్యాయ పోస్టులతో నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.

### పాత నోటిఫికేషన్ లో పోస్టులు

పాత నోటిఫికేషన్ లో 6,100 పోస్టులు ఉన్నాయి. అందులో ఎస్జీటీ పోస్టులు 2,280, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 2,299, టీజీటీ పోస్టులు 1,264, పీజీటీ, ప్రిన్సిపాల్ పోస్టులు 215 ఉన్నాయి. వీటికి సుమారు 3.30 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి మార్చి 30 నుంచి ఏప్రిల్ 30 వరకు పరీక్షలు జరగాల్సి ఉంది. అయితే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఈ పరీక్షలు జరగలేదు. ఎన్నికల కోడ్ పూర్తి అయిన తరువాత పరీక్షలు నిర్వహించాలని ఈసీ పేర్కొనడంతో డీఎస్సీ పరీక్షలకు బ్రేక్ పడింది. దీంతో పాటు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)ను కూడా నిర్వహించారు. ఫిబ్రవరి 27 నుంచి మార్చి 6 వరకు టెట్ పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా 2,67,559 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ పరీక్షల ఫలితాలు విడుదలకు ఈసీ బ్రేక్ వేసింది. ఎన్నికల కోడ్ వల్ల పాఠశాల విద్యాశాఖ విడుదల చేయలేదు. దీనిపై నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తాజాగా గతంలో విడుదల చేసిన నోటిఫికేషన్ కు కనీసం రెట్టింపు సంఖ్యలో పోస్టులను పేర్కొంటూ నోటిఫికేషన్ విడుదల చేయాలని అధికారులు భావిస్తున్నారు.

### ఏపీలో 39 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ

రాష్ట్రంలో 39,008 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని గతేడాది జులైలో లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం తెలిపింది. 2023 జులై 31న లోక్‌సభలో ఒక ప్రశ్నకు అప్పటి కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి అన్నపూర్ణ దేవి సమాధానం ఇచ్చారు. ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు 2022-23లో 39,008 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. 20021-22లో 38,191 ఉపాధ్యాయ పోస్టులు, 2020-21లో 22,609 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.




# అటు కేరళ.. ఇటు ఉత్తర ప్రదేశ్

ఢిల్లీ: లోక్ సభ ఎన్నికలలో యూపీలోని రాయ్‌బరేలీ, కేరళలోని వయనాడ్ నుంచి మూడు లక్షల పైచిలుకు మెజారిటీ గెలుపు సాధించిన రాహుల్ గాంధీ.. రూల్స్ ప్రకారం ఏదో ఒక సీటును వదులుకోవాల్సిన పరిస్థితి. అయితే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ భేటీలో ఈ అంశం కూడా చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం.. ఆయన కేరళ వయనాడ్ సీటునే వదులుకోబోతున్నారని తెలుస్తోంది. ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 ప్రకారం.. ఒకరు ఒక స్థానం కంటే ఎక్కువ చోట్ల నుంచి పోటీ చేయొచ్చు. కానీ, ప్రాతినిధ్యం మాత్రం ఒక్క స్థానం నుంచే వహించాలి. ఫలితాలు వెలువడిన 14 రోజుల్లో ఒక స్థానానికి కచ్చితంగా రాజీనామా చేయాలి. అలా జరగని పక్షంలో ఆ రెండు స్థానాలను ఆ వ్యక్తి కోల్పోవాల్సి వస్తుంది. అయితే అటు కేరళ, ఇటు ఉత్తర ప్రదేశ్ సీనియర్లు మాత్రం రాహుల్ తమ రాష్ట్రంలోనే కొనసాగాలని ఆకాంక్షిస్తున్నారు. సీడబ్ల్యూసీ భేటీలో యూపీ కాంగ్రెస్ నేత ఆరాధన మిశ్రా.. రాయ్‌బరేలీ గాంధీ కుటుంబానికి చెందిందని, కాబట్టి దానిని వదులుకోకూడదని సూచించారు. అయితే 80 లోక్‌సభ సీట్లున్న ఉత్తర ప్రదేశ్‌లో పార్టీని పటిష్టం చేయడానికి రాహుల్ కొనసాగాల్సిన అవసరం ఉందని పలువురు కోరారు. మరోవైపు కేరళ నేతలు కూడా వయనాడ్ నుంచే కొనసాగాలని కోరినట్లు తెలుస్తోంది. ఇక్కడి నుంచి రెండోసారి గెలిపించినందున ఈ సీట్లోనే కొనసాగాలని కేరళ కాంగ్రెస్ నాయకులు విజ్ఞప్తి చేశారు. అయితే. ఉత్తర ప్రదేశ్‌లో పార్టీ అభివృద్ధిపై దృష్టి సారించడం కోసం ఈ సీటును అట్టిపెట్టుకోవాలని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తోంది. యూపీపై దృష్టి సారించాల్సి ఉందన్న అధిష్ఠానం సూచనల మేరకు కేరళ కాంగ్రెస్ నాయకులు కూడా ఆ తర్వాత అందుకు అంగీకరించారని తెలుస్తోంది. మరోవైపు, రాహుల్ గాంధీ వదులుకుంటే కనుక, అదే వయనాడ్ నుంచి ప్రియాంకా గాంధీని పోటీ చేయించాలన్న విజ్ఞప్తిని కూడా గాంధీ కుటుంబం తిరస్కరించిందని చెబుతున్నారు. కేరళకు చెందిన సీనియర్ నేతను ఇక్కడి నుంచి బరిలోకి దించాలని భావిస్తున్నారు. వచ్చేవారం రాయ్ బరేలీలో సోనియా కుటుంబం పర్యటించనుంది. ఆ తర్వాతే రాహుల్ గాంధీ ఏ సీటును వదులుకుంటారనేదానిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. జూన్ 17వ తేదీలోపు దీనిపై స్పష్టమైన ప్రకటన వెలువడనుంది.

# నైతిక, రాజకీయ ఓటమి...



న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల ఫలితాలను ప్రధాని నరేంద్ర మోదీకి నైతిక, రాజకీయ ఓటమిగా సోనియాగాంధీ అభివర్ణించారు. "కనుక మోదీ దేశానికి నాయకత్వం వహించే నైతిక హక్కు కోల్పోయారు. ఎందుకంటే బీజేపీని, భాగస్వామ్య పక్షాలను పూర్తిగా పక్కన పెట్టారు. కేవలం తన పేరుతోనే ప్రజా తీర్పు కోరారు. కనుక ఓటమికి ఆయనే పూర్తి బాధ్యత వహించాలి. కానీ ఆ పని చేయకపోగా మరోసారి గద్దెనెక్కేందుకు సిద్ధపడుతున్నారు" అంటూ దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్‌గా సోనియా తిరిగి ఎన్నికయ్యారు. శనివారం సీడబ్ల్యూసీ భేటీ అనంతరం పార్లమెంటు సెంట్రల్ హాల్లో జరిగిన కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఎంపీలంతా ఈ మేరకు ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. అనంతరం ఎంపీలనుద్దేశించి ఆమె మాట్లాడారు. "మోదీ నైజం తెలిసిన వారెవరూ ప్రజా తీర్పును ఆయన గౌరవిస్తారని, పాలన తీరుతెన్నులను మార్చుకుంటారని అనుకోరు. కనుక మోదీ సర్కారు తీరును వేయి కళ్లతో గమనించడం, ప్రజా వ్యతిరేక చర్యలను ఎప్పటికప్పుడు ఎండగట్టడం మనందరి బాధ్యత. లౌకిక, ప్రజాస్వామ్య విలువలకు పాతరేసే యత్నాలను అడ్డుకుంటూ పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి" అని ఎంపీలకు ఉద్బోధించారు. "అయితే లోక్‌సభలో కాంగ్రెస్‌తో పాటు ఇండియా కూటమి సభ్యుల సంఖ్య భారీగా పెరిగింది. పార్లమెంటులో మోదీ సర్కారు ఏకపక్ష పోకడలు గత పదేళ్ల మాదిరిగా సాగబోవు. చర్చల్లేకుండా బిల్లుల ఆమోదం, విపక్ష సభ్యులను అవమానించడం, సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగించడం వంటివి చెల్లబోవు" అన్నారు.

### మనకు ఏకంగా శ్రద్ధాంజలి ఘటించారు...

ఇటీవలి ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఎలాగైనా కుప్పకూల్చేందుకు అధికార పార్టీ చేయని ప్రయత్నం లేదని సోనియా అన్నారు. "పార్టీని ఆర్థికంగా కుంగదీశారు. అందరిపైనా కేసులు పెట్టి వేధించారు. చాలామంది కాంగ్రెస్‌కు ఏకంగా శ్రద్ధాంజలే ఘటించారు! కానీ బీజేపీ కుటిల యత్నాలన్నింటినీ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు మొక్కవోని దీక్షతో అడ్డుకున్నారు. కలసికట్టుగా శ్రమించి మంచి ఫలితాలు సాధించారు. వారి ధైర్యానికి మా సెల్యూట్. ఈ విజయంలో అధ్యక్షుడు ఖర్గేది కీలక పాత్ర. ఆయన మనందరికీ స్ఫూర్తిగా నిలిచారు. ఖర్గే నుంచి అందరూ ఎంతో నేర్చుకోవాలి. అలాగే చరిత్రాత్మక భారత్ జోడో యాత్రలు చేసిన రాహుల్ ప్రత్యేక అభినందనలకు అర్హుడు" అన్నారు. పలు రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఆశించిన ఫలితాలు సాధించకపోవడంపై ఆత్మశోధన జరగాలని ఎంపీలను కోరారు. సీపీపీ చైర్‌పర్సన్‌గా తిరిగి ఎన్నికవడం తనకెంతో భావోద్వేగపూరిత క్షణమని సోనియా అన్నారు. "మీరంతా నాపై ఎంతో ప్రేమ చూపుతూ వస్తున్నారు. మీ నమ్మకాన్ని కాపాడుకోవడానికి శాయశక్తులా కృషి చేస్తా" అని చెప్పారు.

# విపక్ష నేతగా రాహుల్



మొదటి పేజి తరువాయి

ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు కల్పించిన రిజర్వేషన్లను కాపాడేందుకు ఎన్నికల క్షేత్రంలో కాంగ్రెస్ పార్టీ అద్భుతంగా పోరాడింది. సమర్థమైన ప్రత్యామ్నాయ రాజకీయ, ఆర్థిక, సామాజిక విజన్‌ను ప్రజల ముందుంచింది. వారు కూడా తమ ఓటు ద్వారా ప్రజాస్వామ్య, రాజ్యాంగ పరిరక్షణకు పట్టం కట్టారు. అందుకు దేశ ప్రజలకు అభినందనలు. కాంగ్రెస్ పార్టీని పునరుజ్జీవన పథంలో నిలిపినందుకు కృతజ్ఞతలు" అంటూ మరో తీర్మానం ఆమోదించింది. "పదేళ్ల మోదీ పాలనను ఈ ఎన్నికల్లో ప్రజలు స్పష్టంగా తిరస్కరించారు. తన పేరుతోనే ఓట్లడిగిన మోదీకి ఇది రాజకీయ నష్టం మాత్రమే కాదు, వ్యక్తిగతంగా, నైతికంగా ఓటమి కూడా! ఆయన అవాస్తవ, విద్వేష, విభజన ప్రచారాలను ప్రజలు తిప్పి కొట్టారు" అని తీర్మానం పేర్కొంది. ఈ ఎన్నికల్లో ఖర్గే, సోనియా, రాహుల్, ప్రియాంక పార్టీని అద్భుతంగా ముందుకు నడిపారంటూ అభినందించింది. "ముఖ్యంగా పార్టీ అద్భుత ప్రదర్శనలో రాహుల్‌ది కీలక పాత్ర. భారత్ జోడో, భారత్ జోడో న్యాయ్ యాత్రలను స్వయంగా రూపొందించి విజయవంతం చేశారు" అంటూ ప్రశంసించింది. ఈ ఎన్నికల్లో రాహుల్‌ను మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా తిరువనంతపురం ఎంపీ శశి థరూర్ అభివర్ణించారు.

విద్వేష రాజకీయాలకు చెంప పెట్టు: ఖర్గే


ఈ ఎన్నికల్లో మొత్తమ్మీద కాంగ్రెస్ ప్రదర్శన బాగున్నా పలు రాష్ట్రాల్లో అనుకున్న ఫలితాలు సాధించలేకపోయామని సీడబ్ల్యూసీ అభిప్రాయపడింది. ఆయా రాష్ట్రాల్లో తక్షణ దిద్దుబాటు చర్యల కోసం ప్రత్యేక కమిటీలు వేయాలని భేటీ నిర్ణయించింది. ప్రారంకోపన్యాసం చేసిన ఖర్గే ఎన్నికల ఫలితాలను కాంగ్రెస్‌కు పునరుజ్జీవంగా, విద్వేష, విభజన రాజకీయాలకు చెంపపెట్టుగా అభివర్ణించారు. పార్లమెంటు బయటా లోపలా ఇండియా కూటమి కలసికట్టుగా పని చేయాలని నొక్కి చెప్పారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో అద్భుతంగా రాణించిన రాష్ట్రాల్లో ఈసారి అనుకున్న ఫలితాలు రాబట్టలేకపోయామని కర్నాటక, తెలంగాణలను ఉద్దేశించి అభిప్రాయపడ్డారు. ఎక్కడ పొరపాటు జరిగిందో తేల్చేందుకు అతి త్వరలో రాష్ట్రాలవారీగా ప్రత్యేకంగా మథనం జరుపుతామని వెల్లడించారు. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర జరిగిన ప్రతి చోటా కాంగ్రెస్‌కు సీట్లు, ఓట్ల శాతం పెరిగాయని ఖర్గే అన్నారు.

ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలు కూడా పలు రాష్ట్రాల్లో అద్భుతంగా పని చేశాయంటూ అభినందించారు. "ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ ప్రాబల్య స్థానాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ మెరుగైన ప్రదర్శన చేశాం. పట్టణ ప్రాంతాల్లో పట్టును మరింతగా పెంచుకోవాల్సి ఉంది" అని ఖర్గే అభిప్రాయపడ్డారు. అధికారంలో ఉన్నా, లేకున్నా నిరంతరం ప్రజల శ్రేయస్సు కోసమే కాంగ్రెస్ పోరాడుతుందని ప్రకటించారు. రాష్ట్రాలవారీ కమిటీలు పరిస్థితులను క్షుణ్నంగా సమీక్షించి అధ్యక్షునికి నివేదిక సమర్పిస్తాయని జైరాం రమేశ్ మీడియాకు తెలిపారు.

పదేళ్ల తర్వాత లోకసభలో ప్రధాన ప్రతిపక్ష హోదా

కాంగ్రెస్ పార్టీకి పదేళ్ల తర్వాత లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష హోదా, విపక్ష నేత పదవి దక్కాయి. మొత్తం 543 లోక్‌సభ స్థానాల్లో కనీసం 10 శాతం వస్తేనే ప్రధాన ప్రతిపక్ష హోదా లభిస్తుంది. కాంగ్రెస్‌కు 2014లో 44, 2019లో 52 మాత్రమే రావడం తెలిసిందే.

# భారత్ నుంచి ఆస్ట్రేలియాకు బర్డ్‌ఫ్లూ కేసు-డబ్ల్యూహెచ్‌వో



ఢిల్లీ: ఆస్ట్రేలియాలో మొట్టమొదటిసారిగా బర్డ్‌ఫ్లూ కేసు నమోదయింది. అది కూడా ఒక చిన్నారికి. అయితే ఇప్పుడు ఆ చిన్నారికి బర్డ్‌ఫ్లూ భారతదేశం నుంచే వచ్చిందని చెబుతోంది డబ్ల్యూహెచ్‌వో. చిన్నారి కుటుంబం కొలకత్తాకు వెళ్ళింది. అక్కడి నుంచి తిరిగి వచ్చాక తనకు వైరస్ ఉన్నట్లు తెలిసింది. అయితే కొలకత్తాలో తాము బర్డ్‌ఫ్లూ ఉన్న వ్యక్తులను కానీ, జంతువులను కానీ కలవలేదని చిన్నారి తల్లిదండ్రులు చెప్పారు. అయినా వైరస్ ఎలా సోకిందో తెలియడం లేదని అన్నారు. విక్టోరియాకు చెందిన రెండేళ్ల బాలిక ఫిబ్రవరి 12 నుండి ఫిబ్రవరి 19 వరకు కోల్‌కతాకు వెళ్లి మార్చి 1న ఆస్ట్రేలియాకు తిరిగి వచ్చిందని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. అయితే ప్రస్తుతం చిన్నారి వైరస్ నుంచి పూర్తిగా కోలుకున్నాడు. మార్చి 22న బర్డ్‌ఫ్లూ వైరస్ లక్షణాలతో ఆసుపత్రిలో జాయిన్ అయిన బాలుడు రెండు వారాల చికిత్స అనంతరం డిశ్చార్జ్ అయ్యాడు. అయితే బాలుడికి వ్యాధి ఎలా సోకిందనేది మాత్రం కచ్చితంగా తెలియలేదు. ఒక్కోసారి వ్యాధి సోకిన పక్షుల మాంసం, గుడ్లు తినడం ద్వారా కూడా బర్డ్ ఫ్లూ రావచ్చిన ఆస్ట్రేలియాలో డాక్టర్లు చెబుతున్నారు. అయితే ఇవన్నీ అనుమానాలు మాత్రమేనని..ఎలా వచ్చిందనేది నిర్ధారణకు రాలేదని తెలిపారు. మరోవైపు ఆస్ట్రేలియాలో బర్డ్ ఫ్లూ వ్యాప్తి చెందుతోంది. దీంతో అక్కడి ప్రభుత్వం, పక్షులు, పౌల్ట్రీకి సంబంధించిన ఎగుమతులను నిలిపివేస్తూ నిర్ణయం తీసుకుంది. మాంసం, గుడ్లులతో పాటూ అడవి, దేశీయ పక్షుల దిగుమతులను తక్షణమే నలిపివేస్తున్నట్టు ఫిలిప్పీన్స్ వ్యవసాయ మంత్రిత్వ శాఖ శనివారం తెలిపింది.

## రైతులను దోచుకుంటున్న ఐకెపి కొనుగోలు కేంద్రాలు

నల్లబెల్లి(**గౌతమ్ న్యూస్** ): ధాన్యం కొనుగోలులో ఐకెపి కేంద్రాల్లో దోపిడీ చేస్తున్నారని రైతుల కథనం.. రైతుల కథనం ప్రకారం గుండ్లపహాడ్ శివారు గొల్లపల్లి గ్రామానికి చెందిన మెరుగు సాంబయ్య పండించిన 298 బస్తాల ధాన్యాన్ని రాంపూర్ ఐకెపి కొనుగోలు కేంద్రానికి తీసుకువెళ్లాడు నిర్వాహకులు అక్రమాలకు పాల్పడి 290 బస్తాలకు సంబంధించిన డబ్బులు మాత్రమే జమ చేశారు మిగిలిన 8 బస్తాల డబ్బులు నిర్వాహకులు తమకు అనుకూలమైన రైతు బ్యాంకు ఖాతాలో వేశారు ఈ విషయాన్ని గమనించిన సాంబయ్య నిర్వాహకులను నిలదీయడంతో డబ్బులు చెల్లిస్తామని రాజీ కుదుర్చుకున్నారు ఈ సమస్య ఇతడిది ఒక్కడిదే కాదు రాంపూర్ ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించిన రైతులందరికీ 40 మంది రైతులను దోపిడీ చేసినట్లు రైతులు ఆరోపించారు బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం రాంపూర్ ఐకెపి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు చేస్తున్నారు నిర్వాహకులు సుమారు 100 మంది రైతుల నుంచి 6, క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఈ ధాన్యాన్ని మిల్లులకు తరలించి సకాలంలో రైతులకు డబ్బులు అందించాలి రైతులకున్న నమ్మకాన్ని వమ్ము చేస్తూ నిర్వాహకులు ధాన్యం బస్తాలను తగ్గించారు. అక్రమాలకు పాల్పడి మిగిలించుకున్న ధాన్యం బస్తాలను అనుకూలమైన రైతుల పేరుతో మిల్లులకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు ఈ విషయాన్ని గమనించిన రైతులు నిలదీయడంతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకునే ప్రయత్నం చేశారు. ఒకరు ఇద్దరు కాదు ఏకంగా 40 మందికి పైగా రైతులను దోపిడీ చేశారు రైతులు పెద్దమనుషులను ఆశ్రయించారు జరిగిన దోపిడీ గురించి నిలదీశారు తప్పు జరిగిందని ఒప్పుకున్నా నిర్వాహకులు దోపిడీ చేసిన ధాన్యానికి సంబంధించిన డబ్బులు చెల్లించేందుకు అంగీకరించారు 100 బస్తాలలోపు కాంటా పెట్టిన రైతులకు నిర్వాహకులు దోపిడీ చేసిన మొత్తం బస్తాలు ఇవ్వాలని నిర్ణయించారు 100 బస్తాలకు పైగా కాంటా పెట్టిన రైతుల నుంచి ఐదు బస్తాల దోపిడీ చేస్తే నిర్వాహకులు రైతుకు మూడు బస్తాలు మాత్రమే ఇచ్చేలా ఇరువురి పెద్దలు ఈ నెల రెండవ తేదీన తీర్మానం చేశారు ఈ విషయం శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది అధికారులు స్పందించి ధాన్యాన్ని దోచుకున్న నిర్వాహకులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## మూడోసారి ప్రధానమంత్రి మోడీజీ సంబరాలలో జగ్గయ్యపేట నియోజకవర్గం బిజెపి





నందిగామ (**గౌతమ్ న్యూస్** ): మూడోసారిగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా జగ్గయ్యపేట నియోజకవర్గం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పెనుగంచిప్రోలు లోని పోలీస్ స్టేషన్ సెంటర్ వద్ద ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచుకొని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అనంతరం శ్రీ గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ వారిని దర్శించుకుని నరేంద్ర మోడీ పరిపాలన సజావుగా జరగాలి భారతదేశం వికసిత భారత్ గా అభివృద్ధి చెందాలి అని అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం బిజెపి నాయకులు,కార్యాకర్తలు జనసేన - టీడీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్ (ఆయుష్ )అనిగండ్లపాడు వారి ఆధ్వర్యంలో మాగల్లు గ్రామంలో కెకె. వృద్ధాశ్రమంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం





నందిగామ (**గౌతమ్ న్యూస్** ): డాక్టర్. రత్న ప్రియదర్శిని పుట్టినరోజు సందర్భంగా వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మండలం ఆయుష్మాన్ ఆరోగ్యం మందిరం (ఆయుష్) ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల అనిగండ్లపాడు వారి ఆధ్వర్యంలో మాగల్లు గ్రామంలో కెకె . వృద్ధాశ్రమంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారిణి డాక్టర్. రత్న ప్రియదర్శిని వృద్ధులను పరీక్షించి వారికి మోకాళ్ళ నొప్పులు, గ్యాస్, నరాలు నొప్పులు మొదలగు వ్యాధులకు ఉచితంగా ఆయుర్వేద మందులు పంపిణీ చేశారు. డాక్టర్ .వై .రత్న ప్రియదర్శిని పుట్టినరోజు సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులకు వైద్యశాల సిబ్బందితో కలిసి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యశాల సిబ్బంది శ్రీమతి శైలజ,శ్రీజ, రాజారావు,మేఘన, మరియు యోగా గురువు గాడిపర్తి సీతారామారావు సేవలు అందించారు. వృద్ధాశ్రమం నిర్వాహకులు శ్రీ కరిముల్ల, శ్రీమతి హసీనా బేగం పాల్గొన్నారు. గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ డైరెక్టర్ . శ్రీ యం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.





## ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలి




గార్ల (**గౌతమ్ న్యూస్** ): ప్రభుత్వ వ్యతిరేకంగా ప్రవేట్ స్కూల్లో విచ్చలవిడిగా అధికంగాఫీజులు దోపిడీ చేస్తున్నాయి స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని ఈరోజు గార్ల మండల కేంద్రంలో మద్దివంచ గ్రామంలో పి డిఎస్యుసమావేశం జరిగింది ఈ సందర్భంగా పిడిఎస్యు మండల కార్యదర్శి ఎం మహేష్ కుమార్ మాట్లాడుతూ.మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి ప్రైవేటు పాఠశాలలు విచ్చలవిడిగా ఫీజులను వసూలు చేస్తూ పాఠ్యపుస్తకాలను మరియు యూనిఫాములను టైబెల్టులను అడ్మిషన్ ఫీజుల పేరుతో దొరికింది దొర పండుగ డబ్బులను దండుకుంటున్నారు. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి గిరిజనుల ఆదివాసుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని ఈ దందాకు పాల్పడుతున్నట్లు పిడిఎస్యు నాయకులు ఆరోపించారు తక్షణమే ఇటువంటి దందాకు పాల్పడుతున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ఉన్నత అధికారులను డిమాండ్ చేశారు ఒకపక్క కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేటు పాఠశాలలు పాఠ్యపుస్తకాలు యూనిఫామ్ లు టైలు బెల్ట్ పేరుతో బేరసారాలు చేయొద్దని అమ్మవద్దని జారీ చేసినప్పటికీ సర్క్యులర్ ని తుంగలో తొక్కి జిల్లా కేంద్రంలోని పలు పాఠశాలలు విచ్చలవిడిగా పాఠ్యపుస్తకాలు అమ్ముకుంటున్న ఉన్నత అధికారులు చోద్యం చూస్తున్నారు తక్షణమే వాటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం లేకుంటే ప్రత్యక్షంగా ఆందోళనకు విద్యార్థుల పక్షాన పోరాడుతామని అవసరమైతే ఆ పాఠశాలలపై దాడులు చేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

# డాక్టర్ రారు దవాఖాన తీయరు



నల్లబెల్లి(**గౌతమ్ న్యూస్** ): వైద్యులు విధుల్లో లేక మండలంలోని పల్లె దవాఖ నలు వెలవెలబోతున్నాయి వైద్యం అందక రోగులకు తిప్పలు తప్పడం లేదు. మండలంలోని నందిగామ, రేలకుంట, ముచ్చింపుల, గోవిందాపూర్, రాంపూర్, నారక్కపేట గ్రామాల్లోని ఆరోగ్య ఉపకేంద్రాలను గత ప్రభుత్వం పల్లె దవకానాలుగా మార్చి ఎంబీబీఎస్ వైద్యులను నియమించిన విషయం తెలిసిందే రాంపూర్ లో వైద్యుడు ఇటీవల ఉద్యోగానికి రాజీనామా చేశాడు .మిగతా ఐదు చోట్ల వైద్యులు ఉన్న రోగులకు వైద్యం అందని దుస్థితి నెలకొంది మండలంలోని పల్లె దవకానాలలో వాస్తవ పరిస్థితులను చూస్తే నారక్కపేటలో డాక్టర్ నవీన్ మేడ పెల్లి పిహెచ్‌సి లో విధులు నిర్వహిస్తున్నారు నందిగామ, రేలకుంట, ముచింపుల, గోవిందాపూర్ గ్రామాల్లోని పల్లె దవాఖానాల్లో వైద్యులు విధుల్లో లేరు. సమాచారం కోసం ప్రయత్నించగా సిబ్బంది దాటవేత ధోరణి అవలంబించారు దవాఖానాల్లో ఎఎన్ఎం ఆశా వర్కర్లు మాత్రమే సేవలు అందిస్తున్నారు వైద్యులు వారానికి మూడు రోజులు ఆస్పత్రికి వస్తున్నారని గ్రామస్తులు తెలిపారు.

### విచారణ చేస్తాం

మండలంలోని పల్లె దవాఖానాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం గోవిందాపూర్ వైద్యుడు సెలవులో ఉన్నాడు మిగతా ఆసుపత్రుల్లో వైద్యులు విధులకు హాజరు కాకుండా నిర్లక్ష్యం చేస్తున్న విషయం నా దృష్టికి రాలేదు విచారణ చేస్తాం రైతులు విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటాం పల్లె దవాఖానాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి చేస్తాం

**-ప్రకాష్ డిప్యూటీ డిఎంహెచ్ఓ, నర్సంపేట7**

## బ్యాంక్ లోన్ లు ఇప్పిస్థామని రైతులకు బురిడి కొట్టిన కేటుగాడు...

### లక్షల్లో వసూళ్ల ... రైతుల పట్టాపాస్ పుస్తకాలు తీసుకొని పరార్..!

### లబో దిబో మంటున్న రైతులు..!

బయ్యార(గౌతమ్ న్యూస్ ): మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలానికి చెందిన ఓ యువకుడు కష్టపడకుండా రైతుల నిరక్షరాస్యతను ఆసరా చేసుకొని వారికి బ్యాంకు లలో క్రాప్ లోన్ లు ,ముద్రా లోన్లు ఇప్పిస్తానంటూ నమ్మ బలికి జిల్లాలో పలు మండలాలలోని గ్రామాల రైతులను నమ్మించి, పలువురు కిరాణా షాపు యజమానుల నుండి ఒక్కొక్కరి వద్ద యాభై నుండి లక్షలరూపాయలు ,రైతుల నుండి వ్యవసాయ భూముల పట్టా పాస్ పుస్తకాలు తీసుకుని..సదరు కేటుగాడు బ్యాంకు లోన్ ఇప్పించక పోవడంతో మోసపోయామని విషయాన్ని ఆలస్యంగా తెలుసుకొని బాదితులు,లబోదిబోమంటున్నట్లు సమాచారం. బయ్యారం మండలంలోని బయ్యారం, బాలాజీపేట ,గౌరారం, జిల్లాలోని మొండి కుంట గ్రామంలో పలువురు రైతుల వద్ద పెద్ద ఎత్తున నగదు, భూమి పట్టాలు తీసుకొని ఉడాయించినట్లు స్థానికుల సమాచారం. నమ్మించి మోసం చేసిన వ్యక్తి కోసం పలువురు రైతులు పట్టుకునేందుకు మండలంలో వెతుకులాట కొనసాగిస్తున్నట్లు సమాచారం.

## ఎమ్మెల్యే కూనంనేని సమక్షంలో సిపిఐ లో చేరిన మున్సిపల్ కౌన్సిలర్లు మరియు 100 కుటుంబాలు



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి(**గౌతమ్ న్యూస్** ): కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సిపిఐ కార్యాలయంలో కొత్తగూడెం నియోజకవర్గం అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్న కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు తో కలిసి నడిచేందుకు సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా సారథ్యంలో 12వ మున్సిపల్ వార్డు కౌన్సిలర్ కూరపాటి విజయలక్ష్మి, 19 వ మున్సిపల్ వార్డు కౌన్సిలర్ బండి నరసింహా వారితోపాటు 100 కుటుంబాలు సిపిఐ లో చేరారు. ఈ సందర్భంగా వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాస్, దుర్గారాశి వెంకటేశ్వర్లు, సలిగంటి శ్రీనివాస్, సింగరేణి యూనియన్ నాయకులు వంగ వెంకట్, రమణ మూర్తి, క్రిస్టఫర్, సిపిఐ వార్డు కౌన్సిలర్లు కంచర్ల జములయ్య, మునిగడప వెంకటేశ్వర్లు, భూక్య శ్రీనివాస్, యూసఫ్ మాచర్ల శ్రీనివాస్, సత్యనారాయణ చారి, బి విజయ్ కుమార్ , దుర్గా కళ్యాణి, సిపిఐ నాయకులు బత్తుల సురేష్, అజీజ్, నేరెళ్ల రమేష్, లగడపాటి రమేష్ చంద్ర, గుత్తుల శ్రీనివాస్ మిర్యాల రాము ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఫాహిం, అస్లాం, మర్రి గోపి, ఎరుకల రామారావు తదితరులు ఉన్నారు.

## గ్రూప్-1 పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్



కొత్తగూడెం(**గౌతమ్ న్యూస్** ): ఈ రోజు ఉదయం 10 గంటల నుండి ప్రారంభమైన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ అబ్దుల్ కలాం కళాశాల నందు ఏర్పాటు చేయబడిన పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు.అక్కడ విధులలో ఉన్న అధికారులు మరియు సిబ్బందికి పలు సూచనలు చేశారు.కొత్తగూడెం,పాల్వంచలోని 21 పరీక్షా కేంద్రాలలో ప్రశాంతంగా ఈ పరీక్ష కొనసాగుతుందని తెలిపారు.పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ ను అమలు చేస్తూ పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఎస్పీ వెంట కొత్తగూడెం డిఎస్పి రెహమాన్, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన గ్రూప్ -1 ప్రిలిమినరీ పరీక్ష

### : జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల.

భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి(**గౌతమ్ న్యూస్** ): కొత్తగూడెం : తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్ల నడుమ నిర్వహించామని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా నిర్వహించామని ఆమె తెలిపారు.జిల్లాలోమొత్తం 8871మందికి గాను 21 పరీక్ష కేంద్రాల్లో 6649 మంది పరీక్షకు హాజరైనారు. 2222 మంది అభ్యర్థులు గైహాజరైనరని హాజరు శాతం 74.95% గా నమోదు అయినదని కలెక్టర్ తెలిపారు.




## పూర్వ విద్యార్థుల కలయికతో మధురమైన లక్షణాలు



అన్నపురెడ్డిపల్లి(**గౌతమ్ న్యూస్** ): అన్నపురెడ్డిపల్లి మండల పరిధిలో గల యర్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1995-96 సంవత్సరం లో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల కలయిక ఆత్మీయ సమ్మేళనం జడ్పీహెచ్ఎస్ ఎర్రగుంట పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ఒకే వేదికపై సమావేశమై ఒకరి కొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. పాఠశాల ప్రాంగణం అంత కలియతిరిగి పాత జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. స్నేహితులు ఒకరితో ఒకరు సెల్ఫీలు దిగింది మురిసిపోయారు. అప్పట్లో తమకు పాఠాలు బోధించిన గురువులను ఘనంగా సన్మానించారు. అందరూ కలిసి సహపంక్తి గా భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో టీచర్లు మోహన్ రావు, నారాయణరెడ్డి, రామయ్య, పురుషోత్తం, జెడ్ పి ఎస్ ఎస్ హెచ్ ఎం ఆనంద్ కుమార్, పూర్వ విద్యార్థులు బోయినపల్లి అవినాష్, మానికల సీతయ్య, సుభాని, రాంబాబు, నరసింహారెడ్డి, దుర్గ, సీతారత్నం, నాగ రాజా కుమారి, తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నతమైన న్యాయ వ్యవస్థ కోసం కృషి చేస్తున్న సంఘం ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్

### ఏ ఐ ఎల్ యు జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్ మక్కడ్.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి(**గౌతమ్ న్యూస్** ): కొత్తగూడెం : భారతదేశం లోని న్యాయ వ్యవస్థ మరింత ఉన్నతంగా ఎదగడం కోసం ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ కృషి చేస్తున్నదని, ఏ.ఐ.ఎల్.యు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్ మక్కడ్ అన్నారు. ఈ నెల 23న తెలంగాణ హై కోర్టు వారు తలపెట్టిన జ్యూనియర్ సివిల్ జడ్జ్ నియామకాల కోసం నిర్వహిస్తున్న స్క్రీనింగ్ టెస్టులో ఉత్తీర్ణత సాధించటం కోసం ఈ రోజు కొత్తగూడెం బార్ అసోసియేషన్ హాలులో ఏ.ఐ.ఎల్.యు. ఆధ్వర్యంలో నిర్వహించిన మోడల్ టెస్ట్ ను ప్రారంభిస్తూ మక్కడ్ ప్రసంగించారు. జిల్లా కోశాధికారి కిలారు పురుషోత్తం రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంచి నాణ్యమైన న్యాయమూర్తులు సమాజానికి చాలా అవసరమని ఆయన అన్నారు. న్యాయవాదులకు ప్రతి ఏటా వృత్తి నైపుణ్య శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు ఆయన అన్నారు. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామ్యవాదం, న్యాయం లక్ష్యాలుగా ఏ.ఐ.ఎల్.యు. పని చేస్తున్నదని, వాటి సాధనలో భాగంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని ఆయన వివరించారు. రాష్ట్ర బాధ్యులు పి.కిషన్ రావు మాట్లాడుతూ ఏ ఐ.ఎల్.యు. కార్యక్రమాల్లో న్యాయవాదులందరూ పాల్గొని అవకాశాలను సద్వినియోగం చేసుకోవలని కోరారు. మోడల్ టెస్టులో కొత్తగూడెంలో ప్రధమ స్థానంలో నిలిచిన కాటూరి బిందును వక్తలు అభినందించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం బార్ అసోసియేషన్ క్రీడా సాంస్కృతిక కార్యదర్శి దూదిపాల రవి కుమార్, మహిళా ప్రతినిధి నల్లమల ప్రతిభ, ఏ.ఐ.ఎల్.యు. బాధ్యులు కె.పుల్లయ్య, తెల్లబోయిన రమేష్, పసుపులేటి శ్రీనివాస్, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు ఏ.రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పేకాట శిబిరం పై రైడ్ ఆరుగురు వ్యక్తులు అరెస్ట్

### ఎవరైనా అసాంగిక కార్యకలపాలకు పాలుపడితే వారిపై కటినచర్యలు తప్పవు : ఎస్ఐ చంద్రశేఖర్.



అన్నపురెడ్డిపల్లి (**గౌతమ్ న్యూస్** ): అన్నపురెడ్డిపల్లి మండల పరిధిలోని పెద్దిరెడ్డిగూడెం గ్రామపంచాయతీ కొండాయిగూడెం గ్రామ శివారులో ఆదివారం నాడు సాయంత్రం మూడు గంటల సమయంలో స్థానిక మామిడి తోటలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పట్టుకొని అరెస్ట్ చేసిన స్థానిక ఎస్సై చంద్రశేఖర్ వారి సిబ్బంది . పట్టుబడిన వ్యక్తుల నుంచి 12300 డబ్బులు, ఐదు సెల్ ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం పరుచుకున్నారు. ఆరుగురుపై కేసు నమోదు చేశారు.

## ఏపీలో వేసవి సెలవులు పొడిగింపు.. ఎందుకంటే?

ఆంధ్రప్రదేశ్‌లో వేసవి సెలవులను ఈ నెల 12 వరకు పొడిగిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. షెడ్యూల్ ప్రకారం 12న పాఠశాలలు పునఃప్రారంభం కావాల్సి ఉండగా.. తాజా మార్పుతో 13న రీఓపెన్ అవుతాయని సర్కారు తెలిపింది. వేసవి సెలవులను ప్రభుత్వం ఓ రోజు పెంచింది. ఈ నెల 12న సీఎం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెసులుబాటు కల్పించాలని ఉపాధ్యాయ సంఘాలు కోరాయి. వారి కోరిక మేరకు స్పందించిన ప్రభుత్వం సెలవులను మరో రోజు పొడిగించింది. చంద్రబాబు ప్రమాణస్వీకారానికి భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి.. ఈ నెల 12న ఉదయం 11.27 నిమిషాలకు చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. గన్నవరం మండలం కేసరపల్లి ఐటీ పార్క్ సమీపంలో ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రధానితో పాటు వీఐపీలురానుండడంతో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. కృష్ణా జిల్లా గన్నవరం ఐటీ పార్కు సమీపంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారోత్సవ ఏర్పాట్లను రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి (రవాణా, రోడ్లు, భవనాలు) ప్రద్యుమ్న పరిశీలించారు. ప్రద్యుమ్న శనివారం గన్నవరంలో పర్యటించి జూన్ 12న ప్రమాణ స్వీకారోత్సవం ఏర్పాట్లను పరిశీలించారు. గన్నవరంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ గన్నవరం సమీపంలోని కేసరపల్లి గ్రామంలోని ఐటీ మేధా పార్కు సమీపంలో ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్రమోదీ, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఇతర నేతలు హాజరవుతారని తెలిపారు. సీటింగ్, వేదిక, బారికేడింగ్, భద్రత, పార్కింగ్, పారిశుధ్యంపై జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఇతర అధికారులతో చర్చించారు.

## ముస్తాబౌతున్న చంద్రబాబు ప్రమాణ స్వీకార వేదిక



కృష్ణాజిల్లా గన్నవరం మండలం కేసరపల్లి వద్ద చంద్రబాబు ప్రమాణ స్వీకార వేదిక సిద్ధమవుతోంది. సభా వేదిక పనులు దగ్గరుండి అధికారులు, టీడీపీ నాయకులు పరివేక్షిస్తున్నారు. ఈనెల 12వ తేదీ టీడీపీ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. సభా వేదిక నిర్మాణం వద్ద టీడీపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రత్యేక దళాలతో భారీ బందోబస్తు చేసేలా ప్రణాళిక ఏర్పాటు చేశారు. ఏర్పాట్లను సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్, ఇతర ఐఏఎస్ లు పర్యవేక్షిస్తున్నారు. గన్నవరం విమానాశ్రయం సమీపంలో కేసరపల్లి వద్ద గల ఐటీ పార్క్, మేధా టవర్స్ నేషనల్ హైవే పక్కన ఉన్న పొట్లూరి బసవరావు స్థలంలో చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అనంతరం రాష్ట్ర మంత్రులు కూడా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. చంద్రబాబు మంత్రులతో గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్రమోడీతో సహా పలువురు ప్రముఖులు హాజరు కానున్నారు. ప్రమాణ స్వీకారం ఏర్పాట్లపై విజయవాడలోని క్యాంపు కార్యాలయం నుంచి సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రమాణ స్వీకార సభకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. . అతిథులుగా వచ్చిన వారికి, సభాస్థలికి విస్తృతమైన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని పోలీసు శాఖను ఆదేశించారు. సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవ ఏర్పాట్ల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను కూడా నియమించారు. సీఎం ప్రమాణ స్వీకార ఏర్పాట్ల కోసం ఐదుగురు ఐఏఎస్‌ల బృందాన్ని సాధారణ పరిపాలన శాఖ(జీఏడీ) నియమించింది. బృందంలో సభ్యులుగా ఐఏఎస్ అధికారులు బాబు.ఏ, హరి జవహర్ లాల్, కన్నబాబు, సీహెచ్ హరికిరణ్, వీర పాండియన్‌లు ఉన్నారు. తదుపరి ఆదేశాల కోసం జీఏడీ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ ఎదుట ఐదుగురు ఐఏఎస్‌లు హాజరు కావాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

## కాబోయే మంత్రులకు కీలక సూచనలు చేసిన మోదీ



ముచ్చటగా మూడోసారి ప్రధానిగా నరేంద్ర మోదీ ఆదివారం రాత్రి ప్రమాణస్వీకారం చేయనున్నారు. రాష్ట్రపతి భవన్‌లో రాత్రి 7.15 గంటలకు మోదీ ప్రధానిగా ప్రమాణస్వీకారం చేస్తారు. ఆయనతో పాటు 57 మంది మంత్రులుగా ప్రమాణం చేస్తారు. అయితే.. చివరి క్షణంలో ఒకరిద్దరు పేర్లను మార్చే అవకాశం ఉండొచ్చని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటి వరకు కేంద్ర మంత్రుల లిస్ట్‌లో ఉన్నవారి లిస్ట్ చూసినట్లు అయితే.. తెలుగు రాష్ట్రాల నుంచి ఐదుగురికి అవకాశం దక్కినట్లు తెలుస్తోంది. వీరిలో టీడీపీ నుంచి ఇద్దరు, బీజేపీ నుంచి ముగ్గురు ఉన్నారు. ఏపీ నుంచి బీజేపీ నరసాపురం ఎంపీ శ్రీనివాసవర్మ పేరు ఖరారు అయినట్లు తెలుస్తోంది. ప్రమాణస్వీకారానికి కొద్ది గంటల ముందే కాబోయే మంత్రులతో మోదీ సమావేశం అయ్యారు. ఈ క్రమంలోనే వారికి తేనేటి విందు కార్యక్రమం ఏర్పాటు చేశారు. దేశ అభివృద్ధి కోసం ఈ భేటీలో నేతలకు మోదీ కీలక సూచనలు చేశారు. కేంద్రమంత్రులుగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత.. బాధ్యతలపై దృష్టి పెట్టాలని మోదీ సూచించారు. దేశ అభివృద్ధి కోసం నిత్యం కృషి చేయాలన్నారు. చేపట్టిన ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేసేలా పనిచేయాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు. ప్రధానిగా మోదీ సాయంత్రం ప్రమాణస్వీకారం చేయనున్నారు. ప్రధానితో పాటుగా మరికొందరు మంత్రులు ప్రమాణస్వీకారం చేస్తారు. ఈసారి కేబినెట్‌లో ఇద్దరు మాజీ సీఎంలకు చోటు దక్కింది. వీరిలో హర్యానా మాజీ సీఎం మనోహర్ లాల్ ఖట్టర్, మధ్యప్రదేశ్ మాజీసీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ ఉన్నారు.

## నవీన్ పట్నాయక్ రాజకీయ వారసుడిగా చెప్పబడుతున్న వీకే పాండియన్ సంచలన నిర్ణయం..



ఒడిశాలో నవీన్ పట్నాయక్‌కి చెందిన బిజూ జనతాదళ్(బీజేడీ) దారుణంగా ఓడిపోయింది. రాష్ట్ర అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో బీజేపీ మెజారిటీ సీట్లను సాధించి అధికారాన్ని కైవసం చేసుకుంది. మరోవైపు ఎంపీ సీట్లను బీజేపీ క్లీన్ స్వీప్ చేసింది. ఈ ఎన్నికల్లో నవీన్ పట్నాయక్ తర్వాత వీకే పాండియన్ పేరు ప్రముఖంగా వినిపించింది. మాజీ బ్యూరోక్రాట్, తమిళనాడుకు చెందిన వ్యక్తి అయిన వీకే పాండియన్ బీజేడీలో కీలకంగా వ్యవహరించారు. అయితే, నవీన్ పట్నాయక్ ఇలా అధికారుల చేతిలోకి వెళ్లారని బీజేపీ విమర్శించింది. ఇదిలా ఉంటే, బీజేడీ దారుణ పరాజయం తర్వాత వీకే పాండియన్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. తాను క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. ఓ వీడియో సందేశాన్ని విడుదల చేసిన ఆయన ఇందులో ఈ విషయాన్ని ప్రకటించారు. ఒక సామాన్య కుటుంబం, చిన్న గ్రామం నుంచి వచ్చినట్లు చెప్పారు. ఐఏఎస్‌లో చేరి ప్రజలకు సేవ చేయాలనేది తన చిన్ననాటి కల అని చెప్పారు. నేను ఒడిశా గడ్డపై అడుగు పెట్టిన రోజు నుండి, ఒడిశా ప్రజల నుండి నాకు అపారమైన ప్రేమ మరియు ఆప్యాయత లభించింది వెల్లడించారు. రాష్ట్ర ప్రజల కోసం చాలా కష్టపడి పనిచేయడానికి ప్రయత్నించానని తెలిపారు. బీజేడీ తిరిగి అధికారంలోకి వస్తే దేశంలోనే అత్యధిక కాలం ముఖ్యమంత్రిగా పనిచేసే మైలురాయిని చేరుకునేందుకు నవీన్ పట్నాయక్ కోసం పనిచేయడం గౌరవంగా భావిస్తున్నట్లు పాండియన్ చెప్పారు. నాకు లభించిన అనుభవం జీవితాంతం ఉంటుందని, ఒడిశా ప్రజల పట్ల ప్రేమ తనకు ఎల్లప్పుడూ ఉంటుందని చెప్పారు. ఒడిశాలో మొత్తం 147 అసెంబ్లీ స్థానాలు ఉంటే 78 స్థానాల్లో బీజేపీ విజయం సాధించింది. బీజేడీ 51, కాంగ్రెస్ 14 స్థానాల్లో గెలుపొందాయి. గత ఎన్నికల్లో బీజేపీకి అక్కడ కేవలం 23 సీట్లనే గెలుచుకుని, ఈసారి మాత్రం అధికారాన్ని కైవసం చేసుకుంది. మొత్తం 21 ఎంపీ స్థానాల్లో బీజేపీ 20 స్థానాలను గెలుచుకుంది.

## తెలుగు రాష్ట్రాల అభివృద్ధి కోసం పనిచేస్తాం



కేంద్రమంత్రిగా కాసేపట్లో మరోసారి ప్రమాణస్వీకారం చేయబోతున్న తెలుగు రాష్ట్రాల అభివృద్ధి కోసం చేస్తామని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి దిల్లీలో మీడియాతో మాట్లాడారు. సంకల్పపత్రం పేరుతో ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి వచ్చే అయిదేళ్లు అంకితభావంతో పని చేస్తానని తెలిపారు. తెలంగాణలో గత పదేళ్లలో కేంద్రప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేసిందని .. రోడ్లు, రేషన్ బియ్యం, గ్రామాలకు మంచినీటి సరఫరా వంటి అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు. గత పదేళ్లలో దేశవ్యాప్తంగా నాలుగు కోట్ల ఇళ్లు నిర్మించామని, రాబోయే రోజుల్లో పేదలకు మరో 3 కోట్ల ఇళ్లు నిర్మిస్తామని తెలిపారు. రాబోయే రోజుల్లో భాజపాను మరింత బలోపేతం చేసే దిశగా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సికింద్రాబాద్ పరిధిలో తన గెలుపు కోసం పని చేసిన పదాధికారులు, మోర్చాల అధ్యక్షులకు ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ముసుగులో మజ్లిస్ పోటీ చేసిందని, అయినప్పటికీ ప్రజలు ఆ కుట్రలను తిప్పికొట్టారన్నారు. మోదీ ప్రమాణస్వీకారం పూర్తికాగానే మేళతాళాలతో కార్యక్రమాలను నిర్వహించాలని భాజపా జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా పిలుపునిచ్చారని, రాష్ట్రంలోనూ ఆ కార్యక్రమాలను కొనసాగించాలని పార్టీ అధ్యక్షుడిగా ఆదేశిస్తున్నట్టు చెప్పారు.

# మరో పోరాటానికి గిరిజనులు సిద్ధం

### గిరిజనులకు రిజర్వేషన్ తగ్గిస్తే ఇక ఉద్యమమే

### జనాభా ప్రతిపదికన, ప్రభుత్వ శాసనం జి.ఓ 33 ద్వారా ఇచ్చిన ఎస్టీ రిజర్వేషన్ పది శాతం ఉండాల్సిందే

### ఐక్యరాజ్యసమితి సభ్యులు, హైకోర్టు ప్రభుత్వ న్యాయవాది జోగురాం నాయక్



మానుకోట జిల్లా **(గౌతమ్ న్యూస్ ):** ఆదివారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఏ.బి ఫంక్షన్ హాల్ లో గిరిజన రిజర్వేషన్ సాధన సమితి(జి ఆర్ ఎస్ ఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో సభాధ్యక్షులు వహించిన తెలంగాణ ఉద్యమకారుడు గుగులోతు రవి నాయక్. అదే విధంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఐక్యరాజ్యసమితి సభ్యులు జోగురాం నాయక్, వైరా మాజీ ఎమ్మెల్యే చంద్రావతి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బానోతు రవి కుమార్ నాయక్ మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం ప్రభుత్వ శాసనం ద్వారా జీవో నెంబర్ 33 ద్వారా ఇచ్చిన ఎస్టీ రిజర్వేషన్ 10 శాతం ఉండాల్సిందే, రిజర్వేషన్ శాతం తగ్గించాలని గిరిజనులకు అన్యాయం చెయ్యాలని చేసే కుట్రలను తిప్పికొట్టాలి అని అన్నారు. అదేవిధంగా %+.ా% 3 కూడా అమలు చేసేదాకా కొట్లాడాల్సిన అవసరం మనకు ఉంది అని అన్నారు. గిరిజన సమాజం ఒక్క శాతం రిజర్వేషన్ వదులుకోవడానికి సిద్ధంగా లేదు, ఒక్క శాతం రిజర్వేషన్ కూడా ఎక్కువ తీసుకోవడానికి ఆశ కూడా పడట్లేదు. హైకోర్టులో గిరిజన వ్యతిరేకులు వేసిన పిల్ కు వ్యతిరేకంగా పోరాడుదాం, గిరిజనులు అందరం కలిసి హక్కులు సాధించుకుందాం అని అన్నారు.

#### ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానాలు

ఎస్టిలకు 10 శాతం రిజర్వేషన్ కచ్చితంగా అమలు చేయాలి. జీవో 3 ను అమలు చేసి ఏజెన్సీ ప్రాంతం వారికి న్యాయం చేయాలి. తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన గిరిజనులకు ప్రభుత్వం ఆదుకోవాలి. గిరిజన ప్రజా ప్రతినిధులు నోరు విప్పాలి. జాతి సంఘ విద్రోహ, ఇలాగే ఒంటరిగా మిగిలిపోతారు. అన్ని రాష్ట్రాల లంబాడీలను ఏకతాటిపై తేవాలి. చట్టసభల్లో ఎంపీలు ఎమ్మెల్యేలు 10 శాత రిజర్వేషన్ కోసం ఉద్యమించాలి. రాజ్యాధికారమే లక్ష్యంగా బరిలో దిగాలి. రాష్ట్రస్థాయిలో ఐక్య ఉద్యమాన్ని ఉధృతం చేయాలి. ప్రభుత్వం గిరిజనుల పక్షాన ఉండి జీవో 3 మరియు 33 లను కాపాడాలి. ఈ కార్యక్రమంలో ఏఐబిఎస్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బక్సి నాయక్, గిరిజన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు గుగులోతు కిసాన్ నాయక్, ఎన్ టీవీఎస్ రాష్ట్ర అధ్యక్షులు రామన్న నాయక్, ఎల్ హెచ్ పి ఎస్ జిల్లా నాయకులు రంచంద్రు నాయక్, రాందాస్ నాయక్, ఎల్ ఎస్ ఓ జిల్లా అధ్యక్షులు గుగులోతు శివవర్మ నాయక్, గుగులోతు రాజు నాయక్, కురవి ఆలయ మాజీ చైర్మన్ రాజు నాయక్, ఎరకల సంఘం జిల్లా నాయకులు వీరస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్, సేవాలల్ సేన జిల్లా నాయకులు రాంబాబు, ఉపాధ్యాయ సంఘం నేత రాంజీ నాయక్, గిరిజన సంఘం జిల్లా నాయకులు కిషన్ నాయక్, విద్యార్థి ఉద్యమ నేత చందూలాల్ నాయక్, నారాయణ సింగ్, ప్రభాకర్, జటోత్ కొండయ్య, సురేష్ నాయక్, శంకర్ నాయక్, శ్రీను నాయక్, గణేష్ నాయక్, బానోతు విజయ్ నాయక్, గణేష్, సూర్య వీరన్న, సంతోష్, గిరిజన నేతలు, ఉపాధ్యాయ సంఘ నేతలు విద్యార్థి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# గిరిజనులకు రిజర్వేషన్ తగ్గిస్తే ఇక ఉద్యమమే?....

**మరో పోరాటానికి గిరిజనులు సిద్ధం ....**

**జనాభా ప్రతిపదికన, ప్రభుత్వ శాసనం జి.ఓ 33 ద్వారా ఇచ్చిన ఎస్‌టీ రిజర్వేషన్ పది శాతం ఉండాల్సిందే....**

**గిరిజన సమాజం ఒక్క శాతం రిజర్వేషన్ వదులుకోవడానికి సిద్ధంగా లేదు ఒక్క శాతం రిజర్వేషన్ కూడా ఎక్కువ తీసుకోవడానికి ఆశ కూడా పడట్లేదు....**



తేది:09/06/2024**(గౌతమ్ న్యూస్ ):** నేడు మహబూబాబాద్ జిల్లా కేంద్రం లో ఏ.బి ఫంక్షన్ హాల్ లో గిరిజన రిజర్వేషన్ సాధన సమితి(ఆర్ ఎస్ ఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం లో సభాధ్యక్షులు వహించిన తెలంగాణ ఉద్యమకారుడు గుగులోతు రవి నాయక్ గారు.. అదే విధంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఐక్యరాజ్యసమితి సభ్యులు జోగురా౦ నాయక్ గారు మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం ప్రభుత్వ శాసనం ద్వారా జీవో నెంబర్ 33 ద్వారా ఇచ్చిన ఎస్‌టి రిజర్వేషన్ 10 శాతం ఉండాల్సిందే,రిజర్వేషన్ శాతం తగ్గించాలని గిరిజనులకు అన్యాయం చెయ్యాలని చేసే కుట్రలను తిప్పికొట్టాలి అని అన్నారు. అదేవిధంగా జి.ఓ 3 కూడా అమలు చేసేదాకా కొట్లాడాల్సిన అవసరం మనకు ఉంది అని అన్నారు. హైకోర్టులో గిరిజన వ్యతిరేకులు వేసిన పిల్ కు వ్యతిరేకంగా పోరాడుదాం గిరిజనులు అందరం కలిసి హక్కులు సాధించుకుందాం అని అన్నారు..








ఈ రౌండ్ టేబుల్ సమావేశం లో తీర్మానాలు....

1).. ఎస్టిలకు 10 శాతం రిజర్వేషన్ కచ్చితంగా అమలు చేయాలి..

2). జీవో 3 ను అమలు చేసి ఏజెన్సీ ప్రాంతం వారికి న్యాయం చేయాలి...

3).. తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన గిరిజనులకు ప్రభుత్వం ఆదుకోవాలి...

4). గిరిజన ప్రజా ప్రతినిధులు నోరు విప్పాలి...

5).. చట్టసభల్లో ఎంపీలు ఎమ్మెల్యేలు 10 శాత రిజర్వేషన్ కోసం ఉద్యమించాలి..

6).రాష్ట్రస్థాయిలో ఐక్య ఉద్యమాన్ని ఉధృతం చేయాలి.

7). ప్రభుత్వం గిరిజనుల పక్షాన ఉండి జీవో 3 మరియు 33 లను కాపాడాలి.. ఈ కార్యక్రమంలో వైరా మాజీ ఎమ్మెల్యే చంద్రావతి బాయి గారు,BRS రాష్ట్ర నాయకులు బానోతు రవి కుమార్ నాయక్, AIBSS రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బక్సి నాయక్ గారు, వారు గిరిజన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు గుగులోతు కిసాన్ నాయక్, NTVS రాష్ట్ర అధ్యక్షులు రామన్న నాయక్,LHPSజిల్లా నాయకులు రంచంద్రు నాయక్, రాందాస్ నాయక్,LSOజిల్లా అధ్యక్షులు గుగులోతు శివవర్మ నాయక్, గుగులోతు రాజు నాయక్, కురవి ఆలయ మాజీ చైర్మన్ రాజు నాయక్, ఎరకల సంఘం జిల్లా నాయకులు వీరస్వామి,జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్, సేవాలల్ సేన జిల్లా నాయకులు రాంబాబు, ఉపాధ్యాయ సంఘం నేత రాంజీ నాయక్, గిరిజన సంఘం జిల్లా నాయకులు కిషన్ నాయక్,విద్యార్థి ఉద్యమ నేత చందూలాల్ నాయక్, నారాయణ సింగ్, ప్రభాకర్, జటోత్ కొండయ్య, ,సురేష్ నాయక్,శంకర్ నాయక్,శ్రీను నాయక్,గణేష్ నాయక్ ,బానోతు విజయ్ నాయక్,గణేష్,సూర్య వీరన్న,సంతోష్, గిరిజన నేతలు, ఉపాధ్యాయ సంఘ నేతలు విద్యార్థి నాయకులు తదితరులు పాల్గొన్నారు..

# మోడీ 'గ్యారంటీలు' చాలవు

న్యూఢిల్లీ : 'మోడీ గ్యారంటీలు' సరిపోవని లోక్సభ ఎన్నికల ఫలితాలు నిరూపించాయి. నిరుద్యోగం, వ్యవసాయం వంటి కీలక అంశాలపై ప్రభుత్వం పటిష్టవంతమైన విధానాలు రూపొందించుకోవాల్సిన అవసరం ఉన్నదని ప్రజలు కోరుకుంటున్నారు. గత దశాబ్ద కాలంగా దిగువసభలో బీజేపీకి స్పష్టమైన మెజారిటీ ఉంది. అయితే ఈసారి మ్యాజిక్ ఫిగర్ను చేరుకోలేక చతికిలపడింది. సమాజంలోని కొన్ని వర్గాల్లో నెలకొన్న ఆర్థికపరమైన అశాంతికి పరిష్కారం కనుగొనడంలో మోడీ ప్రభుత్వం విఫలమైంది. అదే ప్రస్తుత ఫలితాల్లో ప్రతిబింబిస్తోంది. ముఖ్యంగా యువత, అన్నదాతల ఆకాంక్షలను ప్రభుత్వం నెరవేర్చలేకపోయింది. యువతకు ఉపాధి కల్పించే విషయంలో రాబోయే ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందుకోసం ముందుగా జాతీయ ఉపాధి విధానాన్ని రూపొందించుకోవాలి. దానిపై విధానపరమైన సంప్రదింపులు జరపాలి. 2014కు ముందు కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వం ఇలాంటి విధానాన్నే రూపొందించి, వివిధ వర్గాలతో చర్చించింది. అయితే జాతీయ ఉపాధి విధానాన్ని అభివృద్ధి చేసే ఆలోచన ఏదీ లేదని ఆ తర్వాత 2022లో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం తేల్చి చెప్పింది.

### ఉద్యోగ కల్పన దిశగా ప్రయివేటుకు రాయితీలు

దేశంలోని 90 శాతానికి పైగా కార్మికులు ప్రభుత్వ మద్దతు, నియంత్రణ లేని ఆర్థిక వ్యవస్థలో పనిచేస్తున్నారు. అలాంటి కార్మికులకు ఉద్యోగాలు కల్పించి, సామాజిక భద్రత చేకూర్చే దిశగా ప్రతి ఒక్కరితోనూ చర్చలు జరపాల్సి ఉంటుంది. ప్రభుత్వం ఇప్పుడు ప్రయివేటు రంగానికి అనేక రాయితీలు అందిస్తోంది. అయితే ఉద్యోగ కల్పన సామర్థ్యం ఉన్న సంస్థలకే రాయితీలందించేలా విధానాలు రూపొందిం చుకుంటే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి.

### మహిళల్లోనే నిరుద్యోగం అధికం

దేశం అధిక వృద్ధి రేటు సాధించిందని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నప్పటికీ అది ఉద్యోగ కల్పనకు పెద్దగా దోహదపడడం లేదు. దేశంలోని కార్మికుల్లో 15-29 సంవత్సరాల మధ్య వయస్కుల్లోనే నిరుద్యోగ రేటు అధికంగా ఉన్నదని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. మరో ముఖ్యమైన విషయమేమంటే లింగ అసమానతలు. పురుషులతో పోలిస్తే మహిళలకు ఉద్యోగావకాశాలు చాలా తక్కువగా ఉన్నాయి. ఈ ఏడాది మొదటి త్రైమాసిక కాలంలో యువతలో నిరుద్యోగ రేటు 17 శాతంగా ఉంది. యువ మహిళా కార్మికుల్లో నిరుద్యోగ రేటు 22.7 శాతానికి చేరుకుంది. ఈ నేపథ్యంలో ఎన్డీఏ ప్రభుత్వం లేబర్ మార్కెట్లో చోటుచేసుకున్న ఒత్తిడిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ప్రయివేటు రంగం నుండి పెట్టుబడులను ప్రోత్సహించి ఉపాధి కల్పనను పెంచాలి.

### వ్యవసాయంలో ఆదాయం అంతంత మాత్రమే

వ్యవసాయ రంగానికి సంబంధించి ఎన్డీఏ ప్రభుత్వం అవలంబిస్తున్న ఆర్థిక విధానాలు నష్టదాయకంగా ఉంటున్నాయి. దేశంలోని కార్మికుల్లో ఎక్కువ మంది వ్యవసాయ రంగం పైనే ఆధారపడుతున్నారు. 2022-23 సంవత్సరపు ఆర్థిక సర్వే ప్రకారం దేశ జనాభాలో 65 శాతం మంది (2021 సమాచారం) గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. జనాభాలో 47 శాతం మంది జీవనాధారం కోసం వ్యవసాయంపై ఆధారపడ్డారు. అయితే వారికి తగినంత ఆదాయం లభించడం లేదు. గ్రామీణ కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య ఇదే.

సమస్యలకు పరిష్కారాలు ఏవి?

2020లో మోడీ ప్రభుత్వం మూడు వివాదాస్పద వ్యవసాయ చట్టాలు తీసుకొచ్చింది.వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలుకు బడా వ్యాపారులను అనుమతిం చేందుకు ఈ చట్టాలను రూపొందించారు.1960వ దశకం నుంచి రైతుల నుండి ప్రభుత్వ సంస్థలే వ్యవసాయోత్పత్తులను కొనుగోలు చేస్తున్నాయి.వాటి స్థానంలో బడా వ్యాపారులను అనుమతించడమే వ్యవసాయ చట్టాల ముఖ్యోద్దేశం.అయితే రైతుల ఆందోళన కారణంగా ప్రభుత్వం ఈ చట్టాలను వెనక్కి తీసుకున్నప్పటికీ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న వ్యవసాయ రంగ సమస్యలను పరిష్కరించాలంటూ రైతులు చేస్తున్న డిమాండ్ను మాత్రం ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. జాతీయ వ్యవసాయ విధానాన్ని రూపొందించే విషయంలో రాజకీయ చిత్తశుద్ధి కొరవడింది.అమెరికా ప్రభుత్వం వ్యవసాయ చట్టాన్ని, యూరోపియన్ యూనియన్ సభ్యులు ఉమ్మడి వ్యవ సాయ విధానాన్ని రూపొందించినప్పటికీ స్వాతంత్ర్యా నంతరం ఏర్పడిన భారత ప్రభుత్వాలు మాత్రం ఆ దిశగా ఎలాంటి ముందడుగు వేయడం లేదు.

గౌతమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక

సంపాదకీయం

# విలువల జాడేది?!

## (విశ్లేషణ)

వేదికలపై గంభీరోపన్యాసాలు చేయడంలో, విలువల గురించి మాట్లాడటంలో మన నాయకులకు ఎవరూ సాటిరారు. ఆ ఉపన్యాసాలకూ, ఆచరణకూ పెద్దగా పొంతనవుండదు. శుక్రవారం జరిగిన ఎన్‌డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ, జేడీ(యూ) అధినేత నితీశ్ కుమార్, టీడీపీ అధినేత చంద్రబాబు చేసిన ప్రసంగాలు ఈ సంగతిని మరోసారి ధ్రువీకరించాయి. అన్ని నిర్ణయాలూ ఏకాభిప్రాయం ప్రాతిపదికనే తీసుకుంటామని మోదీ ప్రకటించారు. మంచిదే. గత అయిదేళ్ల పాలనలో ఏకాభిప్రాయం జాడ ఎక్కడా కనబడకపోగా చాలా నిర్ణయాలు విపక్షాన్ని సభనుంచి గెంటేశాక మూజువాణి ఓటుతో ఆమోదం పొందాయి. ఆ నిర్ణయాలపై తీవ్ర విమర్శలూ వచ్చాయి. ప్రతిఘటన కూడా ఎదురైంది. బహుశా అందువల్లే కావొచ్చు... 2014, 2019 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి సొంతంగా వచ్చిన మెజారిటీ ఈసారి మాయమైంది. మిత్రపక్షాలపై ఆధారపడక తప్పని స్థితి ఏర్పడింది. రామమందిర నిర్మాణం లక్ష్యంగా ఉద్యమాన్ని నడిపి, దానిమాటున మూడున్నర దశాబ్దాలుగా ఎదుగుతూ వచ్చిన బీజేపీ... తీరా ఆలయ నిర్మాణం కొనసాగుతున్న దశలో కనీస మెజారిటీకి దూరంకావటం, యూపీలో సగంపైగా సీట్లు కోల్పోవటం కేవలం యాదృచ్ఛికమని మోదీ చెప్పగలరా? చివరకు అయోధ్య ఉన్న ఫైజాబాద్ నియోజకవర్గాన్ని సైతం బీజేపీ కోల్పోవలసి వచ్చిందని ఆయనకు గుర్తుందో లేదో! అయోధ్య ప్రాంతంలోని 9 స్థానాల్లో 5, ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాసి ప్రాంతంలోని 12 స్థానాల్లో తొమ్మిదింటిని ఈసారి బీజేపీ చేజార్చుకుంది. బీజేపీ హిందుత్వ ప్రాజెక్టుకు ఈ రెండు ప్రాంతాలూ ఆయువుపట్టు. అంతేకాదు... వివిధ రాష్ట్రాల్లో బీజేపీ 2019 ఎన్నికల్లో 50 శాతంపైగా వోట్లతో 224 స్థానాలు గెల్చుకోగా, ఇప్పుడు ఆ సంఖ్య 156కి పడిపోయింది. బీజేపీ 500 కంటే తక్కువ వోట్లతో గెలిచిన స్థానాలు 30... వేయి కంటే తక్కువ వోట్లతో గెలిచిన స్థానాలు 100 ఉన్నాయి. ఇండియా కూటమి, మరీ ముఖ్యంగా అందులోని సమాజ్‌వాదీ పార్టీ దాదాపు అన్నిచోట్లా గణనీయంగా కోలుకుంది. తమ గెలుపును ఓటమిగా చిత్రిస్తున్న కాంగ్రెస్‌ను విమర్శిస్తూ ఇప్పుడూ, గత రెండు సార్వత్రిక ఎన్నికల్లో ఆ పార్టీకొచ్చిన మొత్తం సీట్ల సంఖ్యతో పోల్చినా ఈసారి తమకొచ్చిన స్థానాలు చాలా ఎక్కువని ఎద్దేవా చేయటం బాగానేవుంది. అయితే జరిగిందేమిటో లోతుగా విశ్లేషిస్తే సత్యం బోధపడుతుంది. మోదీ పైకేమి మాట్లాడినా నిరుపేదలూ, మధ్యతరగతి తమకు క్రమేపీ దూరం జరుగుతున్నారని బీజేపీకి అర్థమయ్యే ఉంటుంది. అందుకే ఈసారి ఆ రెండు వర్గాలకూ కొత్తగా సంక్షేమ పథకాలు తీసుకురాబోతున్నట్టు తెలిపారు. పార్లమెంటులో ఏ అంశంపైన అయినా చర్చ జరిగినప్పుడు ఉపన్యాస పోటీలుగా భావించి మాట్లాడటంకాక ఆరోగ్యకరమైన చర్చలకు చోటీయడం ఎంతో అవసరం. ఎన్‌డీఏ సహజసిద్ధమైన కూటమని, ఇందులో అధికార యావలేదని మోదీ చెప్పటం కూడా వింతగానే ఉంది. ఇప్పుడు ఎన్‌డీఏకు మద్దతుగా నిలిచిన నితీశ్, చంద్రబాబులిద్దరూ ఊగిసలాటకు పెట్టింది పేరు. నిలకడ తక్కువ, అవకాశవాద రాజకీయం ఎక్కువ. ఏ గట్టున బాగుంటుందనుకుంటే అటు దూకే బాపతు. 2014 ఎన్నికల్లో ఏపీలో బీజేపీతో కలిసి ప్రయాణించిన చంద్రబాబు 2019 ఎన్నికల్లో హఠాత్తుగా కాడి పారేసి విడిగా ఎందుకు పోటీ చేశారో, అంతకు సంవత్సరం ముందు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో ఎందుకు అంటకాగారో ఎవరైనా చెప్పగలరా? తరచు యూటర్న్‌లు తీసుకోవటంలో నితీశ్, చంద్రబాబులకు పోటీ పెడితే ఎవరు ప్రథమ స్థానం గెల్చుకుంటారో చెప్పటం కొంత కష్టమే. ఇలాంటివారిని పక్కనబెట్టుకుని 'ఇది సహజసిద్ధమైన కూటమి, సుపరిపాలన కోసం కలిశాం' అంటూ పెద్ద పెద్ద మాటలు వల్లిస్తే నమ్మడానికి దేశ ప్రజలు తెలివితక్కువవారు కాదు. మోదీని చంద్రబాబు పొగడ్తలతో ముంచడంమాట అలావుంచి 2014లోనే 'మీరు పదిహేనేళ్లు అధికారంలో వుంటారని బాబు జోస్యం చెప్పార'ని జనసేన నాయకుడు పవన్ కల్యాణ్ అనటం ఆశ్చర్యం కలిగిస్తుంది. మరి 2019లో వీరిద్దరూ ఎన్‌డీఏ నుంచి ఎందుకు బయటకొచ్చినట్టు... ఇప్పుడెందుకు కలిసినట్టు? ఏపీలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై అసత్య కథనాలు ప్రచారంలో పెట్టి, చివరకు కేంద్రమే ప్రతిపాదించిన భూ యాజమాన్య హక్కు చట్టంపై ప్రజానీకాన్ని పక్కదోవ పట్టించి బాబు లాభపడ్డారు. విలువలన్నిటినీ గాలికొదిలి ఏం చేసైనా అధికారంలోకి వచ్చితీరాలన్న పట్టుదలతో వైఎస్సార్ కాంగ్రెస్ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని అత్యంత హీనంగా దుర్భాషలాడారు. కేంద్రంలో నరేంద్ర మోదీ తదితరులు ఏం మాట్లాడినా మౌనంగా ఉండిపోవటమో, ఆలస్యంగా స్పందించటమో చేసిన కేంద్ర ఎన్నికల సంఘం పెద్దలను అనుకరిస్తూ ఏపీలో ఏం జరిగినా, బాబు తదితరులు అవాకులూ చవాకులూ మాట్లాడినా ప్రధాన ఎన్నికల అధికారి ఉలుకూ పలుకూ లేకుండా నిమిత్తమాత్రుడిగా మిగిలిపోయారు. ఆఖరికి పోలైన వోట్లకన్నా గెలిచిన అభ్యర్థికి అధికంగా వోట్లు వచ్చిన ఉదంతాలు అక్కడక్కడ బయటపడ్డాయి. ఇలాంటి అక్రమాలతో గట్టెక్కాలనే కాళ్లావేళ్లాపడి మరీ బాబు ఎన్‌డీఏలోకి లంఘించారు. వేదికలెక్కి విలువల గురించి గంభీరోపన్యాసాలు చేసేముందు మొన్న ఎన్నికల్లో తమ ప్రవర్తన ఎలావుందో, ఏం మాట్లాడామో చూసుకోవటం వారికే మంచిది. పిల్లి కళ్లు మూసుకుని పాలుతాగిన చందాన వేదికలెక్కి విన్యాసాలు చేస్తే జనం నవ్విపోతారని నరేంద్ర మోదీతోపాటు ఎన్‌డీఏ భాగస్వామ్యపక్ష నేతలు తెలుసుకోవాలి. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. కానీ ఉన్నన్నాళ్లూ ఏం చేశారో, ఎలా మెలిగారో ప్రజలు గమనిస్తూనే ఉంటారు.

# త్వరలో నిర్ణయం చెబుతా

సీడబ్ల్యూసీ సభ్యుల ఏకగ్రీవ తీర్మానం

లోక్‌సభలో పార్టీకి నేతృత్వం వహించాలని విజ్ఞప్తి

త్వరలో నిర్ణయం చెబుతానన్న అగ్రనేత

మీరంతా నా కుటుంబం.. మీకు నేనున్నా: రాహుల్

భారత్ జోడోయాత్రతో ప్రజలకు దగ్గరయ్యాం

కాంగ్రెస్ రాష్ట్రాలలో అంచనాలకు భిన్నంగా ఫలితాలు

కారణాలను కనుగొని చర్యలు తీసుకుంటాం: ఖర్గే

సీపీపీ నేతగా సోనియాగాంధీ తిరిగి ఎన్నిక

ప్రజలతీర్పు మోదీకి వ్యతిరేకం: సోనియా



న్యూఢిల్లీ, : లోక్‌సభలో విపక్ష నేతగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ బాధ్యతలు స్వీకరించటానికి రంగం సిద్ధమైంది. పార్టీ లోక్‌సభాపక్ష నేత పదవిని చేపట్టాలంటూ కాంగ్రెస్ పార్టీ రాహుల్‌ను కోరింది. త్వరలో దీనిపై నిర్ణయం తీసుకుంటానని ఆయన పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో శనివారం ఢిల్లీలోని ఆశోకా హెూటల్‌లో సీడబ్ల్యూసీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ, ఇతర సీడబ్ల్యూసీ సభ్యులు ఈ భేటీకి హాజరయ్యారు. ఈ సందర్భంగా సభ్యులందరూ రాహుల్ ఈసారి లోక్‌సభలో పార్టీకి నేతృత్వం వహించాలని, తద్వారా విపక్ష నేతగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం చేశారు. దీనిపై రాహుల్ సానుకూల సంకేతాలు ఇస్తూ.. త్వరలోనే తన నిర్ణయం చెబుతానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'మీరంతా నా కుటుంబం. గత పదేళ్లలో పార్టీని వీడిపోయే వాళ్లు పోయారు. మీకు నేనున్నా' అని కాంగ్రెస్ నేతలకు భరోసానిచ్చారు. పోరాడే ధైర్యం ఉన్న వాళ్లే పార్టీలో ఉన్నారని రాహుల్ వ్యాఖ్యానించారు.

**జోడోయాత్రతో పార్టీ ప్రజలకు దగ్గరైంది**

రెండు గంటల పాటు జరిగిన సీడబ్ల్యూసీ సమావేశాన్ని ఉద్దేశించి ఖర్గే ప్రారంభోపన్యాసం చేస్తూ.. ఎన్నికల్లో దేశప్రజలు కాంగ్రెసను విశ్వసించారని తెలిపారు. రాహుల్ జరిపిన భారత్ జోడో యాత్ర, భారత్ జోడో న్యాయ్ యాత్రతో దేశప్రజలకు కాంగ్రెస్ దగ్గరైందన్నారు. రాజ్యాంగ పరిరక్షణ, ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం, సామాజిక న్యాయం తదితర అంశాలను ఈ ఎన్నికలలో ప్రజల సమస్యలుగా రాహుల్ మార్చారని పేర్కొన్నారు. రాహుల్ యాత్రలు జరిగిన చోట్ల కాంగ్రెసకు ఎన్నికలలో మంచి ఫలితాలు వచ్చాయని ఖర్గే తెలిపారు. గత పదేళ్లలో బీజేపీ జరిపిన విభజన, విద్వేషపూరిత రాజకీయాలను ప్రజలు ఎన్నికలలో తిరస్కరించారని, నియంతృత్వ, రాజ్యాంగ వ్యతిరేక శక్తులకు బుద్ధి చెప్పారన్నారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించుకునేందుకు కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుంచి అపారమైన మద్దతు లభించిందని తెలిపారు. కొన్ని రాష్ట్రాలలో కాంగ్రెస్ మంచి పనితీరు కనబరిచినప్పటికీ మరికొన్ని రాష్ట్రాలలో అంచనాలకు భిన్నంగా ఫలితాలు వచ్చాయన్నారు. అసెంబ్లీ ఎన్నికలలో మంచి ఫలితాలు సాధించి లోక్‌సభ ఎన్నికలలో ఆ స్థాయి ప్రదర్శనను పునరావృతం చేయలేకపోయామని హిమచల్‌ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో కాంగ్రెసకు లభించిన స్థానాలను ఉద్దేశించి ఖర్గే వ్యాఖ్యానించారు. ఫలితాలు ఆశించిన స్థాయిలో రాని రాష్ట్రాల్లో పార్టీ పనితీరుపై కమిటీలను ఏర్పాటు చేసి సమీక్షిస్తామన్నారు. ఎన్నికల్లో ఇండియా కూటమి పక్షాలు ఐక్యంగా, సమర్థంగా పని చేశాయని.. ఇదే ఒరవడిని ఇకపైనా పార్లమెంటులోనూ, పార్లమెంటు బయటా కొనసాగించాలని పేర్కొన్నారు. కాగా, రాహుల్‌గాంధీని లోక్‌సభలో ప్రతిపక్షనేతగా బాధ్యతలు స్వీకరించాలని సీడబ్ల్యూసీ సభ్యులు ఏకగ్రీవంగా కోరారు. కాంగ్రెస్ ఎజెండాను, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలలోకి బలంగా తీసుకెళ్లేందుకు ప్రతిపక్షనేతగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. ఖర్గే కూడా సీడబ్ల్యూసీ సభ్యుల విజ్ఞప్తికి మద్దతు పలికారు. స్పందించిన రాహుల్ త్వరలోనే తన నిర్ణయం చెబుతానని అన్నారు.

**మళ్లీ అగ్రస్థానం చేరుకోవాలి**

సీడబ్ల్యూసీ రెండు తీర్మానాలు చేసింది. ఒక తీర్మానంలో ఎన్నికల ఫలితాలు, పార్టీ పనితీరును ప్రస్తావించింది. 'మోదీ పాలన 2014లో మొదలైనప్పటి నుంచీ దేశంలో ప్రజాస్వామ్యానికి, ప్రజాస్వామిక సంస్థలకు దుర్దశ ప్రారంభమైంది. దీనికి వ్యతిరేకంగా ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారు. మోదీ గ్యారెంటీల పేరుతో ఎన్నికలకు వెళ్లిన ప్రధాని అబద్ధాలు, విద్వేషం, విభజనపూరిత ప్రచారం నిర్వహించారు. ప్రజలు దీనిని తిరస్కరిస్తూ తీర్పు చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, సామాజిక, ఆర్థిక న్యాయాన్ని రక్షించుకోవటానికి వీలుగా తీర్పు ఇచ్చారు. ఇది మోదీకి రాజకీయంగానేగాక నైతికంగా, వ్యక్తిగతంగా కూడా ఓటమే. ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రజల పక్షాన అద్భుతమైన అంశాలను ముందుకు తీసుకొచ్చి ప్రచారం జరిపింది. ఎన్నికల్లో మనం పునరుజ్జీవం పొందాం. కానీ దేశ రాజకీయాల్లో ఒకప్పుడు మనకున్న అగ్రస్థానానికి తిరిగి చేరేందుకు చాలా దూరం వెళ్లాల్సి ఉంది. ప్రజలు కాంగ్రెసకు మరో అవకాశం ఇచ్చారు. పార్టీని నిర్మించుకోవాల్సిన బాధ్యత ఇప్పుడు మనపై ఉంది. మనం చేయాలి. చేస్తాం' అని తీర్మానంలో పేర్కొన్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా బాధ్యతలు చేపట్టాలని రాహుల్‌ను కోరుతూ మరో తీర్మానం చేశారు. కాగా, ఈ భేటీకి ఏపీ, తెలంగాణ నుంచి పలువురు కాంగ్రెస్ నేతలు హాజరయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు దామోదర రాజనర్సింహ, వంశీచంద్‌రెడ్డి, పల్లంరాజు, టి.సుబ్బిరామిరెడ్డి, రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు తదితరులు హాజరయ్యారు. మరోవైపు, ఏపీలో జరుగుతున్న దాడుల పట్ల కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు స్పందిస్తూ.. ఈ రకమైన దాడులను వైసీపీయే మొదలుపెట్టిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. దేశవ్యాప్తంగా బీజేపీ కూడా ఇదే తరహా దాడులకు పాల్పడుతోందన్నారు. శాంతిభద్రతలను పోలీసులు కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

**రాయ్‌బరేలీకే రాహుల్ ఓటు**

న్యూఢిల్లీ, జూన్ 8: కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ రాయ్‌బరేలీ స్థానాన్ని అట్టిపెట్టుకునే అవకాశాలు ఉన్నట్టు కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. ఆయన ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీతో పాటు, కేరళలోని వయనాడ్ నుంచి కూడా గెలుపొందారు. ప్రజాప్రాతిని?ధ్య చట్టం ప్రకారం ఒక సభ్యుడు రెండు స్థానాల్లో పోటీ చేయవచ్చు. కానీ ఒక స్థానానికి మాత్రమే ప్రాతినిధ్యం వహించాల్సి ఉంటుంది. ఈ అంశంపై ఫలితాలు వెలువడిన 14 రోజుల్లోగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. లేకుంటే రెండూ రద్దవుతాయి. ఈ నేపథ్యంలో ఆయన ఏ నియోజకవర్గాన్ని అట్టిపెట్టుకోవాలి, దేన్ని విడిచిపెట్టాలన్నదానిపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో చర్చ జరిగింది. వయనాడ్ నుంచే ప్రాతినిధ్యం వహించాలని కేరళ ఎంపీలు కోరగా, రాయ్‌బరేలీని నిలుపుకోవాలని యూపీ నేతలు కోరారు. మూడు సార్లు మినహాయిస్తే రాయ్‌బరేలీ నుంచి గాంధీ కుటుంబ సభ్యులే ప్రాతినిధ్యం వహిస్తున్నారని యూపీ నేతలు గుర్తుచేశారు. 1952 నుంచి ఆ కుటుంబానికి చెందిన వారే ఎంపీలుగా ఉన్నారని, అది తరతరాలుగా వారికి కంచుకోటలా ఉందని తెలిపారు. రాహుల్.. రాయ్‌బరేలీలో ఉంటేనే యూపీలో కాంగ్రెస్ బలపడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఆయన రాయ్‌బరేలీనే నిలుపుకొని అవకాశం ఉందని భావిస్తున్నారు.

**కాంగ్రెస్ సీపీపీ నేతగా సోనియాగాంధీ**

కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సీపీపీ) చైర్‌పర్సన్‌గా సోనియాగాంధీ తిరిగి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో కొత్తగా ఎన్నికైన కాంగ్రెస్ ఎంపీలతో సమావేశం జరిగింది. సీపీపీ నేతగా సోనియా పేరును ఖర్గే ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనను గౌరవ్ గొగోయ్, కె.సుధాకరన్, తారిఖ్ అన్వర్ బలపరిచారు. ఈ సందర్భంగా సోనియా మాట్లాడుతూ, ఎన్నికల్లో మోదీ ప్రజాతీర్పును కోల్పోయారని, అయినప్పటికీ నైతిక బాధ్యత తీసుకోకుండా తిరిగి ప్రధాని పదవి చేపట్టటానికి సిద్ధమయ్యారని విమర్శించారు. మోదీ తన పనితీరును మార్చుకుంటారని ఆశించలేమని, కాబట్టే, విపక్షంగా ఎప్పటికప్పుడు ఆయనను, ఆయన ఎన్డీఏ ప్రభుత్వ పనితీరును ప్రజలకు జవాబుదారీగా ఉండేట్లు చూసే బాధ్యత మనదేనన్నారు.

# తెలుగు రాష్ట్రాలకు ఆరేడు.. ఎవరెవరంటే..!?

**కేంద్ర మంత్రివర్గంలో పదవులు!?..**

**టీడీపీకి 3, బీజేపీకి 3, జనసేనకు 1**

**రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, బాలశౌరి, పురందేశ్వరి, ఈటల, బండి లేదా డీకే అరుణకు చాన్స్**

**కిషన్‌రెడ్డికి పదవిపై సందిగ్ధత.. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియామకం?**

**మంత్రివర్గంపై అర్ధరాత్రి దాకా మోదీ కసరత్తు**

**మిత్రపక్షాలకు ఇచ్చే పదవులపై స్పష్టత!**

**కీలక శాఖలు బీజేపీ వద్దే**

**మిత్రపక్షాలకు రైల్వే, విద్య, ఐటీ, జలశక్తి..**



న్యూఢిల్లీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రివర్గంలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు ఆరు నుంచి ఏడుగురికి మంత్రి పదవులు లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. వీరిలో టీడీపీ నుంచి ముగ్గురు, బీజేపీ నుంచి ముగ్గురు, జనసేన నుంచి ఒకరు ఉండవచ్చని తెలుస్తోంది. మంత్రి పదవులు వరించే అవకాశం ఉన్న వారిలో తెలుగుదేశం నుంచి కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి. జనసేన నుంచి బాలశౌరికి, బీజేపీ నుంచి పురందేశ్వరికి అవకాశం లభించవచ్చని సమాచారం. తెలంగాణ నుంచి ఈసారి కిషన్ రెడ్డికి మళ్లీ మంత్రి పదవి ఇస్తారా? లేదా? అన్న చర్చ జరుగుతోంది. ఆయనకు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పజెప్పే అవకాశాలు కూడా ఉన్నట్లు ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి. తెలంగాణకు చెందిన ఇతర నేతల్లో ఈటల రాజేందర్, డీకే అరుణ, బండి సంజయ్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తుండగా, బండి సంజయ్, డీకే అరుణల్లో ఒకరికి పార్టీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు అప్పగించవచ్చునని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. మొత్తమ్మీద ఏపీ, తెలంగాణలకు ఆరు నుంచి ఏడు మంత్రి పదవులు లభించే అవకాశం కనిపిస్తోంది. మూడవసారి ప్రధాని పదవిని చేపట్టటానికి సిద్ధమవుతున్న మోదీ తన నూతన మంత్రివర్గం కూర్పుపై కసరత్తును ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. శనివారం అర్ధరాత్రి వరకూ కసరత్తు కొనసాగినట్లు తెలుస్తోంది. ఎన్డీఏ కూటమి మిత్రపక్షాలకు కేటాయించాల్సిన మంత్రిపదవులు, శాఖలపై మోదీ దాదాపు ఒక నిర్ణయానికి వచ్చారని, బీజేపీలో ఎవరెవరికి ఇవ్వాలనేది మాత్రం ఇంకా ఖరారు కాలేదని పార్టీ వర్గాలు తెలిపాయి. ఆదివారం రాత్రి 7.15 నిమిషాలకు మోదీ, ఆయనతోపాటు కొందరు మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరగనున్న విషయం తెలిసిందే. మోదీతోపాటు దాదాపు 30 మంది మంత్రులు ప్రమాణం చేయనున్నట్లు తెలుస్తోంది. మంత్రివర్గంలోకి తీసుకునే వారి పేర్ల జాబితాను ఆదివారం ఉదయమే రాష్ట్రపతి భవన్‌కు పంపిస్తారని, ఈ మేరకు ఆయా నేతలకు ప్రధానమంత్రి కార్యాలయం సమాచారం అందిస్తుందని తెలిసింది. ఇప్పటి వరకూ పూర్తిగా సొంత మెజారిటీతో ప్రభుత్వాన్ని నడిపిన మోదీ.. తొలిసారిగా సంకీర్ణ ప్రభుత్వాన్ని నిర్వహించాల్సి రావడం వల్ల మంత్రివర్గ కూర్పులో మిత్రపక్షాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన పరిస్థితి ఉంది. అయితే హెూం, ఆర్థికం, వాణిజ్యం, పరిశ్రమలు, రక్షణ, విదేశాంగ వ్యవహారాలు, పెట్రోలియం, రోడ్డు రవాణా, న్యాయ మొదలైన మంత్రిత్వ శాఖలను బీజేపీయే తీసుకోవచ్చని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రైల్వే, విద్య, ఐటీ, జలశక్తి, విద్యుత్, గనులు, వ్యవసాయం తదితర మంత్రిత్వ శాఖల్లో క్యాబినెట్ మంత్రి పదవులుగానీ, సహాయమంత్రి పదవులనుగానీ మిత్రపక్షాలకు కేటాయించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.




**ఎన్డీయే మిత్రపక్షాల నుంచి**

కేంద్ర మంత్రివర్గంలో ఎన్డీఏ భాగస్వామ్యపక్షాలకు చెందిన కుమార స్వామి (జేడీఎస్), చిరాగ్ పశ్వాన్ (లోక్ జనశ క్తి), ప్రఫుల్ పటేల్ (ఎన్సీపీ), లలన్ సింగ్, ఇటీవల భారతరత్న పురస్కారం పొందిన దివంగత నేత కర్పూరీ ఠాకూర్ తనయుడు రాంనాథ్ ఠాకూర్, సంజయ్ కుమార్ ఝా (జేడీయూ), జితన్ రాం మాంఝీ (హెచ్ఏఎం), అనుప్రియ పటేల్ (అప్నాదళ్), జయంత్ చౌదరి (ఆర్ఎల్డీ), శ్రీరంగ్ బర్నే, ప్రతాప్ రావు జాదవ్ (శివసేన)లకు అవకాశాలు కనిపిస్తున్నాయి.

**బీజేపీ నుంచి..**

బీజేపీ నుంచి అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్, నితిన్ గడ్కరీ, పీయూష్ గోయల్, శివరాజ్ సింగ్ చౌహాన్, జ్యోతిరాదిత్య సింధియా, బసవరాజ్ బొమ్మై, ప్రహ్లాద్ జోషి, జితిన్ ప్రసాద, రాజీవ్ ప్రతాప్ రూఢీ, గజేంద్ర సింగ్ షెఖావత్, సురేశ్ గోపి, జితేంద్రసింగ్, సర్బానంద సోనోవాల్, దుష్యంత్ సింగ్, శంతను ఠాకూర్, జస్టిస్ అభిజిత్ గంగోపాధ్యాయ, బాన్సురీ స్వరాజ్, పురందేశ్వరి, సంజయ్ జైస్వాల్ తదితరులు ఉండే అవకాశాలున్నాయి.

# దెబ్బకు దెబ్బ అంటున్న పుతిన్!



తమ భూభాగాలపై దాడులు చేసేందుకు పశ్చిమ దేశాలు ఆయుధాలను ఇస్తే వాటిపై దాడులకు తాము కూడా ఇతరులకు అస్త్రాలను అందిస్తామని రష్యా అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్ హెచ్చరించాడు. తామిచ్చిన ఆయుధాలను ఆత్మరక్షణతో పాటు రష్యా మీద ఎదురుదాడులు చేసేందుకు సైతం వినియోగించు కోవచ్చని అమెరికా, ఇతర పశ్చిమ దేశాలు ఉక్రెయిన్కు పవర్ పట్టా ఇచ్చిన సంగతి తెలిసిందే. ఉక్రెయిన్ సంక్షోభంలో పశ్చిమదేశాల కారణంగా ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో కరీబియన్ ప్రాంతంలో మిలిటరీ విన్యాసాలు జరిపేందుకు రష్యా వైమానిక, నౌకా దళం వెళుతున్నట్లు అమెరికా అధికారులు చెప్పారు.పశ్చిమ దేశాల చేతిలో కీలుబొమ్మగా మారిన ఉక్రెయిన్ నేత జెలెన్స్కీ తమ పౌరులను అష్టకష్టాలకు గురిచేస్తున్నాడు. పశ్చిమదేశాల కుట్రను తమ భూభాగం మీద సాగనివ్వను అనే ఒక్క హామీని ఇచ్చి ఉంటే రష్యా మిలిటరీ చర్య అసలు జరిగి ఉండేదే కాదు. శాంతి సభ పేరుతో ఉక్రెయిన్కు మద్దతుగా పశ్చిమ దేశాల తలపెట్టిన సమావేశాన్ని దెబ్బతీసేందుకు రష్యాకు సాయం చేస్తున్నట్లు జెలెన్స్కీ చైనా మీద ఆరోపణలకు దిగటం అర్ధరహితం. తమ సార్వభౌమత్వానికే ముప్పు తలెత్తితే అణ్వాయుధాలను ఉపయోగించేందుకు కూడా వెనుకాడబోమని, నాటో కూటమి దేశాలపై దాడులకు వీలుగా తమ దగ్గర ఉన్న దీర్ఘశ్రేణి ఆయుధాలను ఇతర దేశాలకు అందచేస్తామని సెంట్ పీటర్బర్గ్ అంతర్జాతీయ ఆర్థికవేదిక వార్షిక సమావేశాల సందర్భంగా ప్రతినిధులతో పుతిన్ చెప్పాడు. పశ్చిమ దేశాల ఇటీవలి చర్యలు ఉక్రెయిన్ పోరులో ప్రత్యక్షంగా పాల్గొనటమేనని, అదే పద్ధతిలో వ్యహరించే హక్కును తాము అట్టిపెట్టుకుంటామని అన్నాడు. అమెరికా జనాలు ఎవరిని ఎన్నుకున్నా వారితో కలసిపనిచేస్తామని, ఎన్నికల తరువాత ఏదో మార్పు వస్తుందని తాము అనుకోవటం లేదన్నాడు. ఉక్రెయిన్ వద్ద 1,300 మంది తమ సైనికులు బందీలుగా ఉంటే తమ వద్ద 6,400 వారి మిలిటరీ సిబ్బంది ఉన్నట్లు పుతిన్ చెప్పాడు. కరీబియన్ ప్రాంతానికి వెళుతున్న రష్యా నౌకాదళం క్యూబా, వెనెజులా రేవుల్లో లంగరు వేయవచ్చని భావిస్తున్నట్లు అమెరికా అధికారులు చెప్పారు.ఈ ప్రాంతంలో విన్యాసాలు జరపటం రష్యాకు కొత్త కాదని అయితే, ఉక్రెయిన్కు అమెరికా ఇస్తున్న మద్దతుకు ప్రతిగా, తమ నౌకాదళం సత్తా ఏమాత్రం తగ్గలేదని లోకానికి వెల్లడించేందుకు విన్యాసాలను తలపెట్టినట్లు అమెరికా భావిస్తున్నది. మూడో వంతు నల్లసముద్ర రష్యా నౌకలను నాశనం చేసినట్లు గతంలో ఉక్రెయిన్ చెప్పుకున్నది. అంతర్జాతీయ దళాల్లో అనేక దేశాలు మిలిటరీ విన్యాసాలు జరుపుతున్నాయి. వాటికి ఆ ప్రాంత దేశాల అనుమతులు లేదా భాగస్వామ్యంతో నిమిత్తం లేదు. బాల్టాప్స్ పేరుతో రష్యా ముంగిట బాల్టిక్ సముద్రంలో 1971 నుంచి అమెరికాతో సహా నాటో దేశాలు ప్రతిఏటా తమ బలాన్ని వెల్లడించేందుకు విన్యాసాలు జరుపుతున్నాయి.ఈనెల 7 నుంచి 20వరకు అమెరికా సప్తమనౌకా దళంతో అనేక దేశాలు భాగస్వాములు కానున్నాయి. పశ్చిమదేశాలు పంపే ఆయుధాలతో పాటు వాటి వినియోగంపై శిక్షణకు ఎవరినైనా పంపితే ఎవరికీ మినహాయింపు ఉండదని వారు ఫ్రెంచి వారు మరొకరు ఎవరైనా కావచ్చు, వారి మీద దాడులు జరుపుతామని రష్యా హెచ్చరించింది. త్వరలో ఫ్రాన్సు నుంచి శిక్షకులు తమదేశానికి రానున్నట్లు ఉక్రెయిన్ ప్రకటించిన పూర్వరంగం, బ్రిటన్ వెయ్యి డ్రోన్లను పంపుతున్న సందర్భంగా ఈ ప్రకటన వెలువడింది. బహిరంగంగా వెల్లడించనప్పటికీ ఇప్పటికే కొన్ని దేశాల నుంచి వచ్చిన వారు రహస్యంగా శిక్షణ ఇస్తున్నట్లు గతంలోనే వార్తలు వెలువడ్డాయి. అవసరమైతే తమ మిలిటరీని పంపుతామని ఫ్రెంచి అధ్యక్షుడు మక్రాన్ గతంలో ప్రకటించాడు. ఇప్పటికే అమెరికా నుంచి వచ్చిన ఆయుధాలను తమ సరిహద్దుకు అరవై కిలోమీటర్ల దూరంలో ఉన్న రష్యా నగరం బెల్గోరోడ్ మీద ఉక్రెయిన్ ప్రయోగించినట్లు వార్తలు వచ్చాయి.ఉక్రెయిన్ ఏ రోజు ఏ లక్ష్యాల మీద దాడులు చేసేదీ ప్రతిరోజూ తమకెలా తెలుస్తుందని, అసలు తామిచ్చిన వాటిని ఉపయోగించిందీ లేనిదీ కూడా తమకు తెలియదని అమెరికా జాతీయ భద్రతా మండలి ప్రతినిధి జాన్ కిర్బీ అమాయకత్వం నటించాడు.



పాలస్తీనా ప్రాంతమైన గాజాలో సాధారణ పౌరులపై మారణకాండ జరుపుతున్న దుష్ట ఇజ్రాయిల్ను నిస్సిగ్గుగా సమర్థిస్తున్న అమెరికా ఇంతకంటే వేరే విధంగా ప్రవర్తిస్తుందని ఎలా అనుకోగలం?


# జనం..బతుకులు ముఖ్యం



మొన్నటిదాకా ఎన్నికల వేడితో హీటెక్కిన రాష్ట్ర రాజకీయాలు%ొ% ఇప్పుడు 'చిహ్నాలు, గీతాల' పేరిట మరింత రంజుగా మారాయి. రాష్ట్ర అధికార చిహ్నాన్ని వీలైనంత తొందరగా మార్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి దూకుడుగా వ్యవహరిస్తోంటే... దాన్ని ఎలా మారుస్తారో చూస్తామంటూ ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ సవాళ్లు విసురుతోంది. ఇదే సమయంలో తెలంగాణ రాష్ట్ర గీతంగా ప్రభుత్వంతో ఆమోదించబడిన 'జయ జయహే తెలంగాణ%ొ%' స్వరకల్పనపై కూడా పెద్ద ఎత్తున దుమారం చెలరేగుతోంది. దానికి స్వరాలు సమకూర్చేం దుకు కీరవాణి కాకుండా తెలంగాణకు చెందిన సంగీత దర్శకులను ఎంపిక చేయొచ్చు కదా.. ? అంటూ కొందరు మండి పడుతున్నారు. ఈ రకంగా ఇటు అధికార పక్షం, అటు ప్రధాన ప్రతిపక్షం భావోద్వేగాలతో కూడిన సున్నిత అంశాలకు రాజకీయ రంగు పులిమాయి. మరోవైపు ప్రజల్ని ఏమార్చటంలో సిద్ధహస్తులైన కాషాయ దళపతులు రకరకాల కుయుక్తులు పన్నుతున్నారు. 'హైదరాబాద్ అంటేనే భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం..' అనేది బండి సంజరు ఉవాచ. అయితే చార్మినార్ వయసెంతో, సంజరు చెప్పే ఆలయం వయసెంతో తెలిసిన మనుషులు, ఫొటోలున్నాయనే విషయాన్ని ఇక్కడ గుర్తెరగాలి. వాస్తవానికి తెలంగాణ దశాబ్ది ఉత్సవాల ముంగిట ఉన్న మనం ఆలోచించాల్సిందేమిటి..? పరిశీలించాల్సి దేమిటి..? అన్న ప్రశ్న తలెత్తినప్పుడు కమ్యూనిస్టు అగ్రనేత పుచ్చలపల్లి సుందరయ్య చెప్పిన మాటలు గుర్తుకురాక మానవు. 'తినటానికి తిండి, కట్టుకోవటానికి బట్ట, తలదాచుకోవటానికి ఓ గూడు.. ఈ మూడింటినీ ప్రజలకు, ముఖ్యంగా పేదలకు అందించామా..? లేదా%ొ%? అన్నది పరిశీలించుకోవాలి,..' దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన చాలా ఏండ్ల తర్వాత అప్పటి పాలకులను ఉద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలివి. ఇప్పుడు తెలంగాణ ఏర్పడి పదేండ్లు పూర్తయిన క్రమంలో రాష్ట్ర ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేరాయా..? వాటిని నెరవేర్చటంలో గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏ మేరకు చిత్తశుద్ధిని ప్రదర్శించాయన్నది గమనించాల్సిన అంశం. ఉమ్మడి రాష్ట్రంలో అనేక రంగాలు, శాఖల్లో కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ వ్యవస్థ కొనసాగింది. నాటి పాలకులు దాన్ని పెంచి పోషించారు. రాష్ట్రాభివృద్ధిలో, ఉత్పత్తిలో కీలకంగా ఉండే కార్మికులకు కనీస వేతనాలు ఆనాడు అమలు కాలేదు. తెలంగాణ వస్తే కాంట్రాక్టు వస్తే ఉండబోదంటూ సెలవిచ్చిన గులాబీ దళపతి.. తర్వాత ఆ మాటే మరి చారు. కనీస వేతనాల జీవోపై మాట్లాడేందుకు కూడా బీఆర్ఎస్ ప్రభుత్వానికి మనసొప్పలేదు. దళితుల ఆర్థిక స్వావలంబనకు ఊతమిచ్చే మూడెకరాల పంపిణీ, నిరుద్యోగులకు భరోసానిచ్చే నిరుద్యోగ భృతి ఎప్పుడో అటకెక్కాయి. ఇవన్నీ కారు పార్టీ పాలనలోని వైఫల్యాల యితే.. ఇప్పుడు కాంగ్రెస్ గద్దెనెక్కిన తర్వాత రాష్ట్రంలో కరువు ఛాయలు అలుముకున్నాయి. భూగర్భ జలాలు అడుగంటి, తాగు, సాగు నీటికి కొరత ఏర్పడింది. రాష్ట్రవ్యాప్తంగా ఒకేతీరుగా లేకపోయినా అప్పుడప్పుడు కరెంటు కోతలు వెక్కిరిస్తున్నాయి. అకాల వర్షాల వల్ల రైతు పరిస్థితి దైన్యంగా మారింది. కల్లాల్లో ధాన్యం తడిసి ముద్దయింది. నాయకుల 'ఉపన్యాసాల్లో' మాత్రమే పంటలకు మద్దతు ధరలు లభిస్తున్నాయి. ఈ యాసంగి నుంచే వరికి రూ.500 బోనస్ అనేది బోగస్గా మారింది. అనేక డిపార్టుమెంట్లలోని కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలంది ఐదారు నెలలైంది. నైరుతి రుతు పవనాలొస్తున్నాయనే చల్లటి కబుర్లు వినొస్తున్నాం అందుకనుగుణంగా వ్యవసాయ శాఖ ప్రణాళికను సిద్ధం చేయలేదు. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ పాలకులు ప్రజలు, ప్రజా సమస్యల పట్ల అనుసరించిన, అనుసరిస్తున్న తీరుకు, ఆయా పార్టీ విధానాలకు ఇవి కొన్ని మచ్చుతునకలు మాత్రమే. దీర్ఘకాలంలో రాష్ట్రానికి, ఇక్కడి ప్రజలకు అవసరమైన ఇలాంటి విషయాలను పక్కనబెట్టి చిహ్నాలు, గేయాల చుట్టూ రాజకీయాలను తిప్పటం, ఆ విధంగా తిప్పాలనుకోవటం బీఆర్ఎస్, కాంగ్రెస్లకే చెల్లింది. బాంచన్ కాల్మొక్త దొరా.. అన్న మట్టి మనుషులకు బందూకునిచ్చి, వారిలో పోరాటతత్వాన్ని, చైతన్యాన్ని రగిలించిన 'వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని' ఈ రెండు పార్టీలూ చిన్నదిగా చూడటం శోచనీయం. వాస్తవానికి ఆ పోరాటం జరిగుండకపోతే తెలంగాణ ప్రాంత ప్రజల పరిస్థితి ఇంకెన్నేండ్లపాటు ఇంకెంత దారుణంగా ఉండేదో..? రాష్ట్ర గీతంలో ఆ మహత్తర పోరాటానికి చోటుకల్పించటం పాలకుల కనీస ధర్మం. దీంతోపాటు పదేండ్ల మోడీ సర్కారు రాష్ట్ర విభజన హామీలను ఉల్లంఘించిన తీరును, తెలంగాణ పట్ల కేంద్రం వివక్షను ఎండగట్టేందుకు దశాబ్ది ఉత్సవాలు చక్కని వేదిక. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి, అర్థవంతమైన చర్చలకు ఆస్కారమివ్వాలి. తద్వారా సహేతు కమైన నిర్ణయాలు తీసుకోవాలి. అంతేతప్ప కాకతీయ తోరణం, చార్మినార్ తొలగింపు తదితర వాటి జోలికెళితే అవి అనవసర వివాదాలకు దారితీస్తాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. రాష్ట్ర చిహ్నం విషయంలో ప్రభుత్వం తొందరపడొద్దు. అలాగాక రాజముద్రల చుట్టే కథ నడిపితే అది రేవంత్ సర్కారుకు శోభనివ్వదుగాక ఇవ్వదు.

# ప్రజారోగ్యానికి గ్యారంటీ కావాలి

'ఆరోగ్యమే మహాభాగ్యం' మనందరికీ తెలిసిన విషయమే. నేటి ఆధునిక కాలంలో కరువు అవుతున్నదే అవి. మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో ప్రజలకు ఆరోగ్య సమస్యలు సర్వసాధారణమయ్యాయి. ఏదో ఒక అనారోగ్య సమస్య లేకుండా ఎవరైనా ఉంటారంటే నమ్మగలమా? కొందరు అన్నమే దొరక్క పస్తులతో చస్తుంటే, మరికొందరికి రకరకాల హొటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్ఫుడ్ సెంటర్లు, బేకరీల్లోని కల్తీ ఆహార పదార్థాలను తింటూ ఆరోగ్యాన్ని దెబ్బ తీసుకుంటున్నారు. చావుదరి చేరు తున్నారు. పేదరికం వెంట వచ్చే ఆకలి, పరిశుభ్రమైన నీరు, గాలి లేక పోవడం వంటివీ కీలకమే. రాష్ట్రం లోని తాజా పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఏమీ లేవు. వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని రాష్ట్ర ఆహార భద్రతా విభాగం గత మూడు వారాలుగా చేస్తున్న విస్తృత తనిఖీల్లో విస్తుపోయే నిజాలు బయటపడుతున్నాయి. ఆహారం కల్తీ కావడం నిత్యకృత్యమైంది. ఉన్నది ఉన్నట్టుగా చెప్పాలంటే కల్తీలేనీ ఆహారమే లేదు. వంట గదుల నుంచి వండే పదార్థాల దాకా అన్నీ అపరిశుభ్రమే. అందులో నాణ్యతా ప్రశ్నార్థకమే. ఇండ్లల్లో వంట చేసుకునే సమయం లేక, ఉన్నా బద్దకించి ఆన్లైన్ ఆర్డర్ల ద్వారా ఫుడ్ తెప్పించుకునే పరిస్థితి. ఇదే అవకాశంగా తీసుకుని కాలం చెల్లిన మసాలా లను కలిపి పాడైపోయిన పదార్థాలను వేడివేడిగా వడ్డించే హొటళ్లు, రెస్టారెంట్లు అనేకం. ఘుమఘుమలాడే వాసనలు, ఆకర్షణీయమైన రంగులు, వేడివేడి వడ్డన ఆకట్టు కుంటున్నా, తింటే మాత్రం అనారోగ్యం తథ్యం. జీవనశైలీ వ్యాధులు అంటడం ఖాయం. ఆపైన ఆస్పత్రిలో రెస్ట్ తప్పదు మరి. పదే పదే కాచిన నూనెల వినియోగం, గడువు ముగిసిన ఆహార పదార్థాలు ఆరోగ్యాన్ని పీల్చిపిప్పి చేస్తు న్నాయి. హొటళ్లలో ఫ్రిడ్జ్లో నిల్వ ఉంచిన పదార్థాలు, నకిలీ వాటర్ బాటిళ్లు, చాక్లెట్లు, మసాలాలు, చీజ్, సిరప్, శాండ్విచ్ బ్రెడ్లను అక్రమంగా విక్రయిస్తున్నారనేది బహిరంగ సత్యం. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 14 వేలకుపైగా ఆహారపు శాంపిళ్లను సేకరిస్తే 3800పైగా శాంపిళ్లల్లో నాణ్యతకు సంబంధించి వివిధ హొటళ్లకు రాష్ట్ర ఆరోగ్య విభాగం






సలహాలు, సూచనలు చేయాల్సి వచ్చింది. 2500కు పైగా శాంపిళ్లల్లో అసలు నాణ్యత లేదని స్పష్టమైంది. 300కుపైగా శాంపిళ్లు భారీగా కల్తీతో ఉన్నట్టు నిర్ధారించింది. రాష్ట్ర రాజధానిలోనే ఇంత దారుణ పరిస్థితి ఉంటే, ఇక జిల్లాల్లో అంచనా వేయగలమా? రుచి సంగతి పక్కనబెడితే శుచిని ఆశించగలమా అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. జీవనశైలీ ఆహారపు అలవాట్లలో గణనీయమైన మార్పులు వస్తుండటం, ఇది ఆరోగ్యంపై పెనుప్రభావాన్ని చూపుతుండటమూ గమనార్హం. జంక్ఫుడ్స్, వ్యాయామం లేకపోవడం, భోజనం, నిద్రకు సమపాలన లేకపోవడం తోనే వ్యాధులు ప్రబలుతున్నాయి. ఆహారంతోనే దాదాపు 56 శాతం వ్యాధులు సంక్రమిస్తున్నాయనేది జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) అంచనా. మంచి ఆరోగ్యం కోసం ఏం తినాలి? ఎప్పుడు తినాలి? తదితర అంశాలను డైటరీ గైడెన్స్ ఫర్ ఇండియన్స్ పేరుతో ఎన్ఐఎన్ తాజాగా విడుదల చేసింది. పోషకాహారంతో బీపీ, షుగర్ ఇతర ముప్పులను తగ్గించుకోవచ్చు. ఉప్పు, చక్కెర, అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్స్ (చిప్స్, బర్గర్లు, పిజ్జా, కూల్డ్రింక్స్) విషయంలో అప్రమత్తత తప్పనిసరి. జిహ్వాచాపల్యం తీర్చుకునే పేర కంట్రోల్ తప్పితే ఇక అంతే సంగతులు. ప్రజలకు సమతుల ఆహారం అందజేసే బాధ్యత ప్రభుత్వాలే తీసుకోవాలి. ఇక్కడ సర్కారు ఒక్కరిదే బాధ్యత కాదు. ప్రజలూ అందులో భాగస్వాములవ్వాలి. తాజా కూరగాయలు, పండ్లను తమ మెనూలో పెట్టుకోవాలి. కాగా సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన తరుణంలో పని గంటలు పెరగడం, కుటుంబాల ఉమ్మడి సంతోష సమయం తగ్గిపోవడం, కార్పొరేటీకరణ, నిరుద్యోగం అధికం కావడం తదితర కారణాలతో ఆర్థిక మూలాలు దెబ్బతినడంతో ప్రజలకు ఆరోగ్య ఇబ్బందులు తలెత్తుతు న్నాయి. పార్లమెంటు ఎన్నికల తర్వాత పరిపాలనపైనే పూర్తిగా దృష్టి పెడతామని సీఎం రేవంత్ చెప్పారు. కల్తీ ఆహారాన్ని అమ్మే హొటళ్లు, రెస్లారెంట్లు, బేకరీలపై ఉక్కుపాదం మోపాలి. కన్నెర్ర చేయాల్సిన అవసరమూ ఉంది. వాటి పీచమణిస్తే కొంతలో కొంతైనా ప్రజలకు మంచి ఆరోగ్యాన్ని ప్రసాదించినట్టే. ప్రజలకు సేవలందించే అన్ని శాఖల్లో పేరుకు పోయిన బూజును దులపాలి. నిరంతర తనిఖీలు, పరిశీలన, కఠిన చర్యలతో సర్కారీ శాఖలను ప్రజల గుమ్మాలు తొక్కేదాకా పరిగెత్తించాలి. ఆయా వృత్తుల వారికి అవగాహనా కార్యక్రమాలు పెంచాలి. అవినీతిపై కొరడా ఝులిపించాలి. సమతుల ఆహారాన్ని అందించడం ద్వారా ప్రజల ఆరోగ్యానికి గ్యారంటీ ఇవ్వాలి.

## అంచనాలను మించి పెరిగిన అమెరికా నియామకాలు




ఢిల్లీ : అమెరికాలో ఉద్యోగ వృద్ధి మే నెలలో అంచనాలను అధిగమించింది. ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ గత నెలలో 2,72,000 ఉద్యోగాలను జోడించింది. ఏప్రిల్‌లో నమోదైన 1,65,000 నియామకాల కంటే మే నెలలో భారీగా పెరిగినట్లు ఆ దేశ కార్మిక శాఖ తెలిపింది. బ్రీఫింగ్ డాట్‌కామ్ ప్రకారం.. విశ్లేషకులు అంచనా వేసిన 1,85,000 పెరుగుదల కంటే ఇది గణనీయంగా ఎక్కువ. 2023 డిసెంబర్ తర్వాత ఇదే గరిష్ఠ స్థాయి. కాగా ఉద్యోగ వృద్ధితోపాటు నిరుద్యోగం కూడా స్వల్పంగా పెరిగింది. నిరుద్యోగ రేటు 3.9 శాతం నుంచి 4.0 శాతానికి పెరిగిందని ఆ శాఖ పేర్కొంది. అయితే వడ్డీ రేట్లను తగ్గించడానికి సరైన సమయం కావడంతో ఊహించిన దానికంటే ఎక్కువ గణాంకాలు ఫెడరల్ రిజర్వ్ గణనను క్లిష్టతరం చేస్తాయి. ద్రవ్యోల్బణాన్ని స్థిరంగా నియంత్రించేందుకు డిమాండ్ తగ్గుతుందనే ఆశతో అమెరికా సెంట్రల్ బ్యాంక్ ఇటీవలి నెలల్లో రేట్లను 23 ఏళ్ల గరిష్ట స్థాయికి చేర్చింది. ఆర్థిక వ్యవస్థ ఊహించిన దానికంటే ఎక్కువ ఉద్యోగాలను జోడించడంతో, ఫెడ్ రేటు కోతలను మరికొంత కాలం నిలుపుదల చేస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. మే నెలలో హెల్త్ కేర్, గవర్నమెంట్ వంటి రంగాలతో పాటు విశ్రాంతి, ఆతిథ్యం వంటి రంగాల్లో ఉపాధి పెరిగిందని కార్మిక శాఖ నివేదిక తెలిపింది.

## ఎర్త్ రైజ్ ఫోటోతో ప్రపంచాన్నే మార్చేసిన నాసా ఆస్ట్రోనాట్ దుర్మరణం



ఢిల్లీ: అంతరిక్ష పరిశోధనా సంస్థ (నాసా)లో విషాదం చోటు చేసుకుంది. నాసా రిటైర్డ్ వ్యోమగామి విలియం ఆండర్స్ (90) ఘోర విమాన ప్రమాదంలో మరణించారు. 1968న నాసా అపోలో 8లో ముగ్గురు వ్యోమగాములు ఫ్రాంక్ బోర్మాన్, జేమ్స్ లోవెల్, విలియం ఆండర్స్ చంద్రుడి మీదకు పంపించింది.అయితే ఈ ముగ్గురు వ్యామగాములు డిసెంబర్ 24, 1968న చంద్ర కక్ష్యలోకి వెళ్లి తిరిగి డిసెంబర్ 27న భూమికి తిరిగి వచ్చారు. అప్పుడే భూమి మూలాలతో చంద్రుడికి సంబంధం ఉన్నట్లు వెల్లడించారు. ఆ ఫోటో తీసింది ఈయనే అపోలో 8లో చంద్రుడి చుట్టు తిరిగే సమయంలో ముగ్గురి ఆస్ట్రోనాట్స్‌లో ఒకరైన విలియం ఆండర్స్ చంద్రుడి ఉపరితలంపై నుంచి వెలుగుతూ కనిపిస్తున్న భూమి ఫోటోని తీశారు.ఈ ఫోటోకు 'ఎర్త్ రైజ్'గా పేరు పెట్టారు. అంతరిక్షం నుంచి భూమికి తీసిన తొలి కలర్ ఫోటో ఇదీ. విమానంలో సాంకేతిక లోపం తాజాగా ఎర్త్‌రైజ్ ఫోటోతీసిన విలియం అండర్స్ జోన్స్ ద్వీపం తీరానికి చేరే సమయంలో ఆండర్స్ ప్రయాణిస్తున్న విమానం కుప్పకూలింది. ఈ విమానం ప్రమాదంలో అండర్స్ మరణించారని, ఆ విమానంలో తన తండ్రి మాత్రమే ఉన్నారంటూ అండర్స్ కుమారుడు గ్రెగ్ చెప్పారంటూ ది సీటెల్ టైమ్స్ నివేదించింది. ఆకాశం నుంచి అనంతలోకాల్లోకి కేసీపీక్యూ-టీవీ కథనం ప్రకారం..అండర్స్ పాతకాలపు ఎయిర్ ఫోర్స్ సింగిల్ ఇంజిన్ టీ-34 విమానంలో ప్రయాణిస్తున్నారు. ఆ సమయంలో లోపం తలెత్తడంతో ఆయన ప్రయాణిస్తున్న విమానం ఆకాశం నుంచి నిటారుగా సముద్ర తీర ప్రాంతాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో అండర్స్ ప్రాణాలు కోల్పోవడంతో నాసాలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## 5 రోజులు ఈ ప్రాంతాల్లో భారీ వర్షాలు!



ఢిల్లీ: దేశంలో నైరుతి రుతుపవనాల రాక మొదలైంది. ఈ క్రమంలో అనేక చోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ నేపథ్యంలో వచ్చే రెండు రోజులు దక్షిణ మహారాష్ట్ర, తెలంగాణ, ఉత్తర కర్ణాటక, దక్షిణ ఛత్తీస్‌గఢ్, దక్షిణ ఒడిశాతోపాటు కోస్తా ఆంధ్రాలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది. దీంతో ఆయా ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ క్రమంలో ముంబై, తెలంగాణతో సహా మహారాష్ట్ర లోని మరికొన్ని ప్రాంతాలకు ముందుగా వర్షాలు వచ్చే పరిస్థితులు ఉన్నాయని వాతావరణ చెప్పింది. ఈ క్రమంలో ముంబయి, మరఠ్వాడా, కొంకణ్ గోవా, మధ్య కర్ణాటక, కేరళ, లక్షద్వీప్‌లలో ఉరుములు, ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. దీంతోపాటు కోస్తాంధ్రా, రాయలసీమ, తెలంగాణ, తమిళనాడు, పుదుచ్చేరిలలో వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ స్పష్టం చేసింది. మరోవైపు రానున్న 5 రోజుల్లో తూర్పు మధ్య భారతదేశం, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో వేడిగాలులు కొనసాగవచ్చని వాతావరణ శాఖ అంచనా వేసింది. వచ్చే 5 రోజుల్లో అరుణాచల్ ప్రదేశ్, అసోం, మేఘాలయ, నాగాలాండ్, మణిపూర్, మిజోరాం, త్రిపుర, బెంగాల్, సిక్కింలలో ఉరుములు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వెదర్ రిపోర్ట్ తెలిపింది. ఈ క్రమంలో కేరళ లోని ఐదు జిల్లాలైన పతనంతిట్ట, కోజికోడ్, వాయనాడ్, కన్నూర్, కాసరగోడ్‌లకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. తిరువనంతపురం, కొల్లాం, అలప్పుజా, కొట్టాయం, ఇడుక్కి, ఎర్నాకులం, త్రిసూర్, మలప్పురం సహా రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాలకు ఎల్లో అలర్ట్ ప్రకటించారు.

## రాష్ట్రవ్యాప్తంగా గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షలు ప్రారంభం..




హైదరాబాద్: తెలంగాణలో గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షలు ఇవాళ (జూన్ 9న) ప్రారంభం కానున్నాయి. ఉదయం 10.30నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష జరగనుంది. రాష్ట్రవ్యాప్తంగా 31జిల్లాల్లో 4లక్షల మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. ఉదయం 9నుంచి 10గంటల్లోపు అభ్యర్థులందరూ పరీక్షా కేంద్రాల్లోకి చేరుకోవాలి. తెలంగాణ వ్యాప్తంగా అభ్యర్థుల కోసం 897పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశారు. నిమిషం ఆలస్యమైనా అనుమతించమని అధికారులు ముందే స్పష్టం చేశారు. పరీక్షకు ఏర్పాట్లన్నీ పూర్తి చేసేలా తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ మహేందర్ రెడ్డి ఆదేశాలు జారీ చేయగా.. అందుకు అనుగుణంగా అధికారులు ఏర్పాట్లు చేశారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు జిల్లా అదనపు కలెక్టర్లతోపాటు నోడల్ ఆఫీసర్లను మహేందర్ రెడ్డి నియమించారు.

# గాజాలో భీకర పోరు.. 210 మంది మృతి

### 400 మందికి గాయాలు

### హమాస్ చెర నుంచి నలుగుర్ని రక్షించామన్న ఐడీఎఫ్



జెరూసలెం/గాజా: సెంట్రల్ గాజాలో నుసెయిరత్‌లో హమాస్ మిలిటెంట్లు, ఇజ్రాయెల్ సైన్యం మధ్య పోరు భీకరంగా సాగుతోంది. శనివారం నుసెయిరత్, పరిసర ప్రాంతాల్లో ఇజ్రాయెల్ దాడుల్లో 210 మంది చనిపోయినట్టు సమాచారం! 400 మంది దాకా గాయపడినట్లు హమాస్‌ను ఉటంకిస్తూ అల్‌జజీరా పేర్కొంది. మృతుల్లో పలువురు చిన్నారులున్నట్లు తెలిపింది. డెయిర్ అల్ బలాహ్‌లోని అల్-హక్సా ఆస్పత్రి మొత్తం రక్తంతో తడిచి వధశాలగా మారిపోయిందని డాక్టర్స్ వితౌట్ బోర్డర్స్ పేర్కొంది.

నలుగురు బందీలకు విముక్తి..

ఇలా ఉండగా, హమాస్ మిలిటెంట్ల చెర నుంచి బందీలను విడిపించుకునేందుకు గాజాపై యుద్ధం ప్రారంభించిన ఇజ్రాయెల్ ఆర్మీ పెద్ద విజయం నమోదు చేసుకుంది. నుసెయిరత్‌లో ఓ భవన సముదాయంపై శనివారం పట్టపగలే ప్రత్యేక ఆపరేషన్ చేపట్టిన ఆర్మీ రెండు వేర్వేరు ప్రాంతాల్లో దాచి ఉంచిన నోవా అర్గామని(25), అల్మోగ్ మెయిర్ జాన్(21), ఆంద్రీ కొజ్లోవ్(27), ష్లోమి జివ్(40) అనే నలుగురు బందీలను సురక్షితంగా తీసుకొచ్చినట్లు తెలిపింది. తాజాగా రక్షించిన నలుగురితో కలిపి ఇజ్రాయెల్ ఆర్మీ ఇప్పటి వరకు కాపాడిన బందీల సంఖ్య ఏడుకు చేరుకుంది. అమెరికా అందించిన సమాచారంతోనే బందీలను ఇజ్రాయెల్ ఆర్మీ గుర్తించి, రక్షించిందని బైడెన్ ప్రభుత్వంలోని ఓ అధికారి వెల్లడించారు. గురు, శుక్రవారాల్లోనూ ఇజ్రాయెల్ దాడుల్లో డజన్ల మంది మరణించారు.

ఆమె వీడియో వైరల్..

శనివారం ఐడీఎఫ్ రక్షించిన వారిలో అర్గామని అనే మన్నారు. హిళ ఉమిలిటెంట్లకు చిక్కిన బందీల్లో అర్గామనికి చెందిన వీడియోనే మొదటిసారిగా బయటకు వచ్చింది. ఇద్దరు మిలిటెంట్లు బైక్‌పై తీసుకెళ్తుండగా 'నన్ను చంపకండి'అని ఆమె రోదిస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరలయ్యాయి. బ్రెయిన్ కేన్సర్ ముదిరి మృత్యుశయ్యపై ఉన్న తనకు కూతురిని చూడాలని ఉందంటూ అర్గామని తల్లి లియోరా ఏప్రిల్‌లో ఒక వీడియో విడుదల చేశారు. చెర నుంచి విడుదలైన అర్గామనితో ప్రధాని నెతన్యాహు ఫోన్‌లో మాట్లాడారు. బందీలందరినీ విడిపించేదాకా యుద్ధం ఆపబోమని స్పష్టం చేశారు.

# మండుతున్న భూగోళం, 21 ఏళ్ల రికార్డు బద్దలు!

**సరాసరి ఉష్ణోగ్రతల్లో రికార్డులు బద్దలు**
**ఎల్‌నినో, మానవ తప్పిదాలే వాతావరణ మార్పులకు కారణం**
**వెల్లడించిన ఐరోపా వాతావరణ సంస్థ కోపర్నికస్ క్లైమెట్ ఛేంజ్ సర్వీసెస్**
**పారిశ్రామికీకరణకు ముందు నాటితో పోలిస్తే 1.52 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు**
**1991-2020 మధ్యనాటి ఉష్ణోగ్రతలతో పోలిస్తే 0.75 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు**
**పారిశ్రామికీకరణకు ముందునాటి కంటే ఇది 1.63 డిగ్రీల సెల్సియస్ ఎక్కువ**
**భూతాపంలో పెరుగుదల 1.5 డిగ్రీల సెల్సియస్ దాటడానికి 80 శాతం ఛాన్స్**
**గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదుకావడానికి 86 శాతం అవకాశం**
**2024-28లో ప్రపంచ ఉష్ణోగ్రతల్లో 1.5 డిగ్రీ సెల్సియస్ పెరగడానికి 47 శాతం ఛాన్స్**
**2023-27 మధ్య కాలంలో ఇందుకు ఒక శాతం మేర అవకాశం**
**1850-1900నాటితో పోలిస్తే 2024-28 మధ్యకాలంలో 1.1 - 1.9 డిగ్రీలు అధికం**



ఢిల్లీ: ఉష్ణోగ్రతలు రికార్డులు బద్దలుకొడుతున్నాయి. ప్రతి ఏడాది రికార్డు స్థాయిలో పెరుగుతూ ప్రజలను ఠారెత్తిస్తున్నాయి. ఒకవైపు పెరుగుతున్న టెంపరేచర్లు, మరోవైపు ముంచెత్తుతున్న భారీ వరదలు జనజీవనాన్ని అస్తవ్యస్తం చేస్తున్నాయి. అయితే.. ఇది స్వీయ తప్పిదమే అంటున్నారు నిపుణులు. మానవ తప్పిదాల వల్లే వాతావరణంలో విపరీతమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయని హెచ్చరిస్తున్నారు. పెను ఉష్ణోగ్రతలు రికార్డులు సృష్టిస్తున్నాయి. గత మే నెల అత్యంత వేడి నెలగా రికార్డు క్రియేట్ చేసింది. అక్కడి నుంచి స్టార్ట్ అయిన ఎండల తీవ్రత దాదాపు సంవత్సరమంతా కొనసాగింది. ఆయా నెలలకు సంబంధించిన సరాసరి ఉష్ణోగ్రతల్లో రికార్డులు బద్ధలయ్యాయి. ఈ ఏడాది మేలో ప్రపంచ వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో మాగ్జిమమ్ టెంపరేచర్స్ నమోదయ్యాయి. వాతావరణంలో విపరీతమై మార్పుల వల్ల వర్షాలు, వరదలు ముంచెత్తాయి. ఎల్‌నినోతో పాటు.. మానవ తప్పిదాలే వాతావరణ మార్పులకు కారణమంటూ ఐరోపా వాతావరణ సంస్థ కోపర్నికస్ క్లైమెట్ ఛేంజ్ సర్వీసెస్ వెల్లడించింది. ఈ ఏడాది మే నెలలో సరాసరి ఉష్ణోగ్రతలు.. పారిశ్రామికీకరణకు ముందు నాటితో పోలిస్తే 1.52 డిగ్రీల సెల్సియస్ మేర అధికంగా ఉన్నట్లు ఐరోపా వాతావరణ సంస్థ వివరించింది. అయితే ఇది దీర్ఘకాలం పాటు కొనసాగితేనే పారిస్ ఒప్పందంలో పేర్కొన్న 1.5 డిగ్రీల సెల్సియస్ పరిమితిని మించిపోయినట్లు భావిస్తారు. గత ఏడాది జూన్ నుంచి ఈ ఏడాది మే మధ్య 12 నెలల సరాసరి భూ ఉష్ణోగ్రతల్లోనూ రికార్డు నమోదైంది. 1991 నుంచి 2020 మధ్యనాటి ఉష్ణోగ్రతలతో పోలిస్తే 0.75 డిగ్రీల సెల్సియస్ అధికంగా నమోదయ్యింది. అంటే.. పారిశ్రామికీకరణకు ముందునాటి కంటే ఇది 1.63 డిగ్రీల సెల్సియస్ మేర ఎక్కువ. రాబోయే ఐదేళ్లలో ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయనే వార్తలు ప్రజలను భయపెడుతున్నాయి. పారిశ్రామికీకరణకు ముందునాటితో పోలిస్తే వచ్చే ఐదేళ్లలో ఏదో ఒక ఏడాది.. 2023లో నమోదైన ఉష్ణోగ్రతల రికార్డులు బద్దలవుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భూతాపంలో పెరుగుదల 1.5 డిగ్రీల సెల్సియస్ దాటడానికి 80 శాతం మేర అవకాశముందని ఐరోపా వాతావరణ సంస్థ తెలిపింది. గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదుకావడానికి 86 శాతం అవకాశముందని వివరించింది. 2024-28 మధ్యకాలంలో ప్రపంచ సరాసరి ఉష్ణోగ్రతల్లో పెరుగుదల 1.5 డిగ్రీల సెల్సియస్ కొనసాగడానికి 47 శాతం అవకాశం ఉందని తెలిపింది. 2023-27 మధ్య కాలంలో ఇందుకు ఒక శాతం మేర అవకాశం ఉందని గత ఏడాది డబ్ల్యూఎంవో ఇచ్చిన నివేదిక వెల్లడించింది. తాజా నివేదిక ప్రకారం.. 1850 నుంచి 1900 మధ్యనాటితో పోలిస్తే 2024 నుంచి 2028 మధ్యకాలంలో భూ ఉపరితలానికి చేరువలోని వాతావరణం సరాసరి ఉష్ణోగ్రత 1.1 నుంచి 1.9 డిగ్రీల సెల్సియస్ మేర అధికంగా ఉండొచ్చని తెలిపింది.

# మంత్రులుగా అనిత, పల్లాకు ఛాన్స్!

### జనసేన నుంచి కొణతాలకు అవకాశం

### గంటా, అయ్యన్నలకు మొండిచేయి

### ఇప్పటికే సంకేతాలు పంపిన చంద్రబాబు

### పదవి కోసం పైరవీలు ప్రారంభించిన మరికొందరు



విశాఖపట్నం: ఉ మ్మడి విశాఖ జిల్లాలో అమాత్య యోగం సీనియర్లకు దక్కే సూచనలు కనిపించడం లేదు.తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వంలో తమకు మంత్రి పదవి దక్కుతుందనే ఆశతో ఎదురుచూస్తున్న సీనియర్లకు నిరాశే ఎదురుకానున్నట్టు తెలుస్తోంది. ప్రధానంగా సామాజికవర్గాల వారీగా ఎస్సీ, బీసీ కోటాలో ఇద్దరికి అవకాశం కల్పించాలని టీడీపీ అధిష్టానం ఒక నిర్ణయానికి వచ్చింది. ఎస్సీ కోటాలో పాయకరావు పేట నియోజకవర్గం నుంచి గెలుపొందిన అనితతో పాటు గాజువాక నియోజకవర్గం నుంచి రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో విజయం సాధించిన పల్లా శ్రీనివాసరావులకు బీసీ (యాదవ) కోటాలో మంత్రి హెూదా దక్కనున్నట్టు తెలుగుదేశం పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది.ఈ మేరకు ఇప్పటికే వీరిద్దరికీ కూడా సమాచారం అందినట్టు ఈ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే, అయ్యన్న మాత్రం పట్టువదలకుండా తనకు మంత్రి పదవి కావాల్సిందేనని ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. మొత్తంగా మంత్రి పదవుల కోసం తెలుగుదేశం పార్టీలో భారీగా పోటీ నెలకొంది. ఇక జనసేన తరపున అనకాపల్లి నుంచి గెలుపొందిన కొణతాల రామకృష్ణ పోటీలో ప్రాధాన్యత క్రమంలో ముందు వరుసలో ఉన్నారు. ఇక బీజేపీ నుంచి విష్ణుకుమార్ రాజు ఆశిస్తున్నారు. అయితే ఆయనకు కష్టమేనని తెలుస్తోంది.

సీనియర్లను పక్కన పెట్టి...

మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ భారీగా సీట్లను సాధించింది. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఏజెన్సీ నుంచి మినహా మిగిలిన పోటీ చేసిన అన్ని స్థానాల్లో విజయం సాధించింది. దీంతో మంత్రి పదవుల కోసం భారీగా పోటీ నెలకొని ఉంది. అయితే ఈ సారి మంత్రి వర్గంలో తన మార్క్ స్పష్టంగా కనిపించేందుకు వీలుగా పూర్తిస్థాయిలో సీనియర్లను పక్కన పెట్టే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగానే సీనియర్లగా ఉన్న గంటా శ్రీనివాసరావు, అయ్యన్న, బండారులను పరిగణనలోనికి తీసుకునే అవకాశం లేదని సమాచారం. ఇందులో బండారు, గంటాలకు సీటు కేటాయించే సమయంలోనే మంత్రి పదవి ఇచ్చే అవకాశం లేదని పరోక్షంగా సంకేతాలు ఇచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. మరోవైపు అయ్యన్నకు మాత్రం కచ్చితంగా మంత్రి పదవి ఇస్తారనే ప్రచారం పార్టీలో జరుగుతోంది. అయితే సీనియర్లను పక్కన పెట్టే ఉద్దేశంతో శ్రీకాకుళంలో కూడా అచ్చెన్నాయుడుకు ఇవ్వడం లేదని సమాచారం. ఇదే కోవలో ఇక్కడ కూడా అయ్యన్న పాత్రుడిని పరిగణనలోనికి తీసుకోవడం లేదని పార్టీలో అంతర్గతంగా ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వంలో కాకుండా మరో విధంగా గౌరవం కల్పిస్తానని అయ్యన్నను బుజ్జగించే అవకాశం ఉందని తెలుస్తోంది. మొత్తంగా సీనియర్లను పక్కన పెట్టి తన మార్క్ పూర్తిస్థాయిలో ఉండే విధంగా చంద్రబాబు వ్యవహరించనున్నట్టు మాత్రం పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

జనసేనలోనూ పోటా పోటీ...

జనసేన నుంచి కూడా మంత్రి పదవుల కోసం పోటీ నెలకొని ఉంది. ప్రధానంగా ఎమ్మెల్యేలుగా గెలిచిన కొణతాలతో పాటు పంచకర్ల, సుందరపు విజయ్‌కుమార్, వంశీకృష్ణలు కూడా మంత్రి పదవులు ఆశిస్తున్నారు. ఇప్పటికే యాదవ సామాజికవర్గం నుంచి పల్లాకు బెర్తు ఉండటంతో వంశీకృష్ణకు ఇచ్చే అవకాశం లేదని తెలుస్తోంది. మరోవైపు మొదటిసారిగా గెలిచిన సుందరపు విజయ్‌కుమార్‌కు కూడా కష్టమేనని సమాచారం. ప్రధానంగా కొణతాలతో పాటు పంచకర్ల రమేష్‌బాబుల మధ్య పోటీ ఉంది. అయితే గవర సామాజికవర్గానికి చెందిన కొణతాల వైపే పవన్ మొగ్గు చూపినట్టు తెలుస్తోంది. కాపు కోటాలో పంచకర్ల కూడా గట్టిగానే ప్రయత్నాలు చేస్తున్నారు. చివరకు ఎవరికి యోగం వరించనుందో మరో రెండు, మూడు రోజుల్లో తేలనుంది. మొత్తంగా అధికారపక్షంలో అమాత్యుల కోసం భారీగా పోటీ నెలకొని... ఎవరి ప్రయత్నాల్లో వారు నిమగ్నమై ఉన్నారు.

## రాహుల్‌ను ప్రతిపక్ష నేతగా చూడాలనుకుంటోన్న రేవంత్ రెడ్డి



ఢిల్లీ : దేశ రాజధానిలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశమైంది. సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై సమీక్షించుకోనుంది. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన మేజిక్ ఫిగర్‌కు అతి సమీపంలో నిలిచిపోయిన నేపథ్యంలో.. అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించబోతోంది. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ మల్లికార్జున ఖర్గే, మాజీ అధినేత్రి సోనియా గాంధీ, సీనియర్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, కేసీ వేణుగోపాల్, జైరామ్ రమేష్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సిద్ధరామయ్య, డీకే శివకుమార్, మాజీ ముఖ్యమంత్రులు వీరప్ప మొయిలీ, భూపేష్ బఘేల్, అశోక్ గెహ్లాట్, సీనియర్ నేత రాజీవ్ శుక్లా.. పలువురు సీడబ్ల్యూసీ సభ్యులు ఇందులో పాల్గన్నారు. సమావేశం ప్రారంభం కావడానికి ముందు రేవంత్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు. సీడబ్ల్యూసీ అజెండా ఏమిటనేది ఇంకా తెలియరావట్లేదని అన్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత బాధ్యతలను రాహుల్ గాంధీ స్వీకరించాలని 140 కోట్ల మంది దేశ ప్రజలు ఆకాంక్షిస్తోన్నారని, తాను కూడా అదే కోరుకుంటోన్నారని చెప్పారు. ఈ 10 సంవత్సరాల్లో నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై రాహుల్ గాంధీ అవిశ్రాంతంగా పోరాడారని గుర్తు చేశారు. రైతులు, నిరుద్యోగులు, యువత, మహిళలు.. ఇలా అన్ని వర్గాలు కూడా మోదీ ప్రభుత్వంలో మోసానికి గురయ్యాయని పేర్కొన్నారు. అలాంటి స్థితిలో వారందరి తరఫున రాహుల్ గాంధీ నిరంతరం పోరాడారని చెప్పారు. ఈ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ సీట్లు భారీగా పెరిగాయని అన్నారు. గతంలో నాలుగు సీట్లు ఉండగా.. ఇప్పుడు ఈ సంఖ్య ఎనిమిదికి పెరిగిందని చెప్పారు. అసెంబ్లీతో పోల్చుకుంటే ఓట్ల శాతం కూడా 39.5 నుంచి 41 శాతానికి పెరిగిందని అన్నారు. మోదీ గ్యారంటీ వారంటీ ఖతం అయిందని విమర్శించారు. పదేళ్ల పాటు వారణాశికి ప్రాతినిథ్యాన్ని వహించిన మోదీకి వచ్చిన ఓట్ల శాతం ఎంత?, ఉత్తరప్రదేశ్‌లో బీజేపీకి ఎన్ని సీట్లు దక్కాయి? అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ఉత్తరప్రదేశ్‌లో సీట్ల సంఖ్యను భారీగా కోల్పోయినందుకు నైతిక బాధ్యత వహిస్తూ మోదీ తన పదవికి రాజీనామా చేసి ఉండాల్సిందని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు

## మరణానికి ముందే స్మారక కట్టడాన్ని ఏర్పాటు చేసుకున్న రామోజీ రావు.. ఫిల్మ్ సిటీలోనే నిర్మాణం..





హైదరాబాద్ : ఈనాడు గ్రూప్ సంస్థల ఛైర్మన్ రామోజీ రావు గుండె సంబంధిత సమస్యలతో శనివారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. కొన్ని రోజులుగా హైదరాబాద్?లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన శనివారం ఉదయం 4.50 గంటలకు కన్నుమూశారు. రామోజీ రావు మృతి పట్ల తెలుగు చిత్ర పరిశ్రమ సంతాపం ప్రకటించింది. ఫిల్మ్ సిటీలోని కార్పొరేట్ భవన సముదాయంలో రామోజీ రావు పార్థివదేహానికి టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, మెగాస్టార్ చిరంజీవి, పవన్ కళ్యాణ్, రాజేంద్ర ప్రసాద్, డైరెక్టర్ రాజమౌళి, కీరవాణి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి, నిర్మలా సీతారామన్ తదితరులు నివాళులర్పించారు. ఈరోజు (జూన్ 9న) రామోజీ రావు అంత్యక్రియలు రామోజీ ఫిల్మ్ సిటీలో జరగనున్నాయి. తెలంగాణ ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో రామోజీ రావు అంత్రక్రియలు నిర్వహించనున్నారు. ఈరోజు ఉదయం 9 గంటల నుంచే అంతిమ యాత్ర ప్రారంభం కానుంది. ఈ క్రమంలో రామోజీరావు మృతికి గౌరవసూచకంగా ఇవాళ లకు సంబంధించిన అన్ని కార్యకలాపాలు నిలిపివేస్తున్నామని టాలీవుడ్ ఇండస్ట్రీ ప్రకటించింది. మరోవైపు ఈరోజు జరగనున్న రామోజీ రావు అంత్యక్రియలను టీడీపీ అధినేత చంద్రబాబుతో సహా పెద్దఎత్తున రాజకీయ, సినీ ప్రముఖులు హాజరుకానున్న నేపథ్యంలో పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేశారు పోలీసులు. రామోజీ రావు తన స్మారక కట్టడాన్ని ముందే సిద్ధం చేసుకున్నారు. రామోజీ ఫిల్మ్ సిటీలోని విశాలమైన ప్రాంతంలో ఆయన నిర్మాణం చేయించుకున్న ఆ స్మృతి కట్టడం వద్దే ఇప్పుడు అంతిమ సంస్కారాలు జరగనున్నాయి. రామోజీ రావు అంత్యక్రియలను తెలంగాణ ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని నిర్ణయం తీసుకోగా.. సీడబ్ల్యూసీ సమావేశాలకు హాజరయ్యేందుకు శుక్రవారం రాత్రే ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి.. అక్కడి నుంచే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి ఆదేశాలు జారీ చేశారు. రామోజీ రావు కుటుంబసభ్యులతో సీఎం ఫోన్ లో మాట్లాడి పరామర్శించారు. రామోజీ ఫిల్మ్ సిటీలోని స్మృతివనంలో నిర్వహించనున్న అంత్యక్రియల ఏర్పాట్లను రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంక, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతి శనివారం పరిశీలించారు.

## అమెరికాపై పగబట్టిన ప్రచండభానుడు.. విలవిలలాడుతున్న ప్రజలు..






ఢిల్లీ: అధిక ఉష్ణోగ్రతలతో అమెరికా మండిపోతుంది. మండే ఎండల దాటికి డొనాల్డ్ ట్రంప్ సభకు వచ్చిన 11మంది వడదెబ్బకు గురయ్యారు. మనకు మన్నటి వరకు వేసవితాపం హాహాకారాలు చేయించినప్పటికీ ప్రస్తుతం నైరుతి రుతుపవనాల రాకతో వాతావరణం చల్లబడింది. ఇదిలా ఉంటే అగ్రరాజ్యం అమెరికాలో మాత్రం పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా ఉంది. అమెరికాలో ఎండలు మండిపోతున్నాయి. అనేక ప్రాంతాల్లో భారీ ఉష్ణోగ్రతలు ప్రజలను భయపెడుతున్నాయి. రోజు రోజుకి నిప్పులు చెరుగుతుండడంతో రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మొన్నటి వరకు మంచుతుఫాన్లతో, భారీ వర్షాలతో తీవ్ర ఇబ్బందులకు గురైన అమెరికన్లు.. ఒక్కసారిగా పెరిగిన ఉష్ణోగ్రతలతో అల్లాడిపోతున్నారు. కనీసం ఇళ్లలోంచి బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. ముఖ్యంగా అమెరికాలోని నైరుతీ రాష్ట్రాలను భానుడి ప్రచండతాపం బెంబేలెత్తిస్తోంది. ఆగ్నేయ క్యాలిఫోర్నియా మొదలుకొని అరిజోనా, నెవడా రాష్ట్రాల వరకు రెండుమూడు రోజుల క్రితం పగటి ఉష్ణోగ్రత 43 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకుంది. నెవాడా రాష్ట్రంలోని లాస్ వేగాస్‌లో నిన్న కూడా వేడి గాలులు కొనసాగాయి. నైరుతి అమెరికాలో వేసవి మొదలుకావడానికి ఇంకా రెండు వారాల వ్యవధి ఉన్నా సూర్య ప్రతాపం ముందే మొదలైంది. ఫీనిక్స్ పట్టణంలో 45 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదై కొత్త రికార్డు నెలకొల్పింది. ఫినిక్స్‌లో రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ సభకు వచ్చిన వారిలో 11 మంది వడదెబ్బ తగలడంతో ఆస్పత్రిలో చేర్చాల్సి వచ్చింది. నెవడా రాష్ట్రంలోని రీనో నగరంలో సాధారణంగా 27 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత ఉంటుంది. రెండు క్రితం అక్కడ 37 డిగ్రీలు నమోదైంది. అరిజోనా రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలలో 43 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత కొనసాగనున్నది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు గ్లోబల్ వార్మింగ్‌కు నిదర్శనమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.వాతావరణ మార్పులతో ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా 2015 ప్యారిస్ వాతావరణ చర్చల్లో విధించుకున్న పరిమితి దాటిపోతోందని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణ మార్పుల కారణంగా ప్రతీ గంట వేడిగా మారుతోందని తెలిపారు. ఉదయం పూట ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాకూడదని, తగినన్ని మంచినీరు తాగాలని అధికారులు ఇప్పటికే సూచనలు జారీ చేశారు. 2016లో 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా.. మునుపటి రికార్డులు బద్దలవుతాయని అధికారులు తెలిపారు.

# బీజేపీ ఆపరేషన్ వైసీపీ - ఆట మొదలు, జగన్ వాట్ నెక్స్ట్..!!





అమరావతి: ఏపీ రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. వైసీపీ అధికారం కోల్పోయింది. బీజేపీ, జనసేనతో కలిసి చంద్రబాబు ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 12న చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి ముహూర్తం ఖరారైంది. అటు కేంద్రంలోనూ మోదీ ప్రభుత్వంలో ఇప్పుడు టీడీపీ కీలకంగా మారుతోంది. దీంతో..వైసీపీ లక్ష్యంగా ఢిల్లీ నుంచి కొత్త ఆపరేషన్ ప్రారంభం కానుందనే ప్రచారం మొదలైంది. అదే జరిగితే జగన్ ఆలోచన ఏంటి. ఏం చేయబోతున్నారు.

ఆపరేషన్ వైసీపీ

ప్రస్తుతం ఏపీ రాజకీయాల్లో కొత్త చర్చ మొదలైంది. కార్తీ చిదంబరం చేసిన ట్వీట్ వైరల్ అవుతోంది. బీజేపీకి వైసీపీ తొలి లక్ష్యంగా మారబోతోందని ఆయన ట్వీట్ చేసారు. వైసీపీ 2019-24 వరకు కేంద్రంలో బీజేపీ ప్రభుత్వానికి పలు సందర్భాల్లో మద్దతుగా నిలిచింది. కేంద్రం సైతం జగన్ కు అదే విధంగా ఏపీ విషయాల్లో సహకారం అందించింది. మోదీ - జగన్ మధ్య సత్సంబంధాలు కొనసాగాయి. ఇక, చంద్రబాబుతో బీజేపీ స్నేహం కుదుర్చుకున్న తరువాత లెక్కలు మారిపోయాయి. ఇప్పుడు వైసీపీ అధికారం కోల్పోవటంతో పాటుగా లోక్ సభ లో కేవలం నాలుగు ఎంపీలనే దక్కించుకుంది.

బీజేపీ కొత్త గేమ్

అయితే, రాజ్యసభలో మాత్రం వైసీపీకి 11 మంది సభ్యుల బలం ఉంది. పెద్దల సభలో టీడీపీకి ప్రాతినిధ్యం లేదు. గత పదేళ్ల కాలంలో బీజేపీ జాతీయ, పలు రాష్ట్రాల్లో చేసిన రాజకీయం ఇప్పుడు ఏపీలో పలువురు విశ్లేషకులు గుర్తు చేసుకుంటున్నారు. చంద్రబాబుకు జగన్ ప్రత్యర్ధిగా ఉండటంతో..బీజేపీ పైన చంద్రబాబు ప్రభావం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. కేంద్రంలో ఇప్పుడు చంద్రబాబు కీలకంగా మారారు. దీంతో..వైసీపీతోనే బీజేపీ ఆపరేషన్ ప్రారంభం అవుతుందనేది కార్తీ చిదంబరం ట్వీట్ సారాంశం. అయితే, వైసీపీ అవసరమైన సమయంలో బీజేపీకే మద్దతుగా నిలుస్తుందనే అభిప్రాయం ఆ పార్టీ నేతలు విశ్వసిస్తున్నారు. దీంతో..ప్రత్యేంగా వైసీపీ నేతలకు తమ వైపు తిప్పుకోవాల్సిన అవసరం లేదనే వాదన విపిపిస్తోంది.

జగన్ ఏం చేయబోతున్నారు

కేంద్రంలో సంఖ్యా పరంగా ఎన్డీఏ ప్రస్తుతానికి సురక్షితంగానే ఉంది. కానీ, భవిష్యత్ లో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకున్నా..ముందుగానూ ప్రత్యామ్నాయంగా మరింత మంది మద్దతు దక్కించుకొనేలా బీజేపీ నాయకత్వం ప్రయత్నాలు చేస్తుందనేది మరో విశ్వేషణ. అందులో భాగంగానే 2019 ఎన్నికల తరువాత టీడీపీ ఎంపీలు బీజేపీలో విలీనం అయిన విధంగా వైసీపీ ఎంపీల పైన ఆ ఒత్తిడి ఉంటుందనే చర్చ పొలిటి కల్ సర్కిల్స్ లో వినిపిస్తోంది. కానీ, మిత్రపక్షాల సహకారంతో కేంద్రంలో ప్రభుత్వం కొనసాగిస్తున్న బీజేపీ ఈ విడత అలాంటి చర్యలకు తొందర పడదనే వాదన కూడా ఉంది. దీంతో..ఇప్పుడు బీజేపీ నాయకత్వం వైసీపీ విషయంలో ఎలాంటి వైఖరితో వ్యవహరిస్తుందనేది ఆసక్తి కరంగా మారుతోంది.

# ఏపీ, తెలంగాణ నుంచి కేంద్రమంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసేది వీళ్లే..



ఢిల్లీ : ఏపీ నుంచి ఎంపికయ్యే కేంద్ర మంత్రులు ఎవరన్నదానిపై స్పష్టత వచ్చింది. గత రెండు రోజులుగా ఉన్న ఉత్కంఠకు తెరపడింది. ఈరోజు మోదీతో పాటు పలువురు మంత్రులు ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఈరోజు కేంద్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసేవారికి ఢిల్లీ నుంచి ఫోన్ కాల్స్ వెళ్లాయి. ఈ జాబితాలో టీడీపీ ఎంపీ రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్?లు ఉన్నారు. ఇక తెలంగాణ నుంచి బీజేపీ ఎంపీ కిషన్ రెడ్డి, బండి సంజయ్ లకు కేబినెట్లో చోటు దక్కింది. దీంతో తెలుగు రాష్ట్రాల్లో నలుగురికి కేంద్రమంత్రి పదవులు ఖాయంగా కనిపిస్తోంది. కేంద్రమంత్రివర్గ కూర్పుపై దాదాపు 9 గంటల పాటు చర్చించారు ప్రధాని మోదీ. బీజేపీ అగ్రనేతలు అమిత్ షా, నడ్డా, రాజ్‌నాథ్ సింగ్‌తో చర్చించారు. మిత్రపక్షాల్లో ఎవరికెన్ని శాఖలు కేటాయించాలన్న విషయంపై ఇప్పటికే స్పష్టత వచ్చింది. మిత్రపక్షాలకు కేబినెట్ బెర్త్ ఇచ్చే విషయంలో ప్రధాని మోదీ ఓ ఫార్ములాని వర్కౌట్ చేశారు. 5 కంటే ఎక్కువ సభ్యులున్న మిత్రపక్షాలకు ఒక కేబినెట్, ఒక సహాయ మంత్రి పదవి ఇవ్వాలని డిసైడ్ చేశారు. రెండు, మూడు ఎంపీలు ఉన్నవారికి ఒక సహాయ మంత్రి పదవి దక్కనుంది. దీని ప్రకారం.. తెలుగుదేశం, జేడీయూ, శివసేన -షిండే వర్గం, లోక్ జనశక్తి - పాశ్వాన్ పార్టీలకు కేబినెట్ పదవులు వరించబోతున్నాయి. అలాగే మిత్రపక్షాల్లో భాగస్వామ్యమైన కుమారస్వామి, ప్రతాప్ జాదవ్ కు కూడా ఫోన్ కాల్స్ వెళ్లాయి. అలాగే నితిన్ గడ్కరీ, శర్బానంద సోనోవాల్, మేఘ్ వాల్, జితేందర్ సింగ్ లకు కూడా ఫోన్ చేసినట్లు సమాచారం. వీరందరు సాయంత్రం రాష్ట్రపతి భవన్?లో జరిగే ప్రధాన మంత్రి ప్రమాణ స్వీకారోత్సవంలో కేంద్రమంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అయితే ఎవరికి ఏ శాఖలు వరించాయన్న దానిపై స్పష్టత రావల్సి ఉంది. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ లో జూన్ 9 శుక్రవారం సాయంత్రం 7.15కు ప్రధానిగా నరేంద్రమోదీ మూడోసారి ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఆయనతోపాటు 30మంది కేంద్రమంత్రులుగా ప్రమాణస్వీకారం చేస్తారు. నరేంద్ర మోదీ ప్రమాణస్వీకారానికి హాజరుకానున్నారు టీడీపీ అధినేత చంద్రబాబు. ఇవాళ మధ్యాహ్నం 12 గంటలకు ఢిల్లీ బయల్దేరి వెళ్లనున్నారు. ప్రస్తుతం ఆయన రామోజీ రావు పార్థివదేహానికి నివాళులు అర్పించేందుకు హైదరాబాద్ వచ్చారు. ఆయన అంత్యక్రియలు పూర్తైన తరువాత నేరుగా ఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే మోదీ ప్రమాణస్వీకారానికి ముఖ్య అతిథులు అందరూ ఢిల్లీకి చేరుకుంటున్నారు. ఇప్పటికే బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా ఢిల్లీకి చేరుకున్నారు. ఇవాళ ఉదయం మాల్దీవ్స్ అధ్యక్షుడు మయిజ్జు ఢిల్లీకి చేరుకున్నారు. మరోవైపు.. మారిషస్ ప్రెసిడెంట్ ప్రవిండ్ జుగ్నౌథ్ కూడా ఢిల్లీకి వచ్చారు. భారత సంప్రదాయం ప్రకారం వీరికి స్వాగతం పలికారు. సాయంత్రం ప్రధాని ప్రమాణస్వీకారంలో వీరు పాల్గొంటారు. ప్రమాణ స్వీకారానికి ముందు జాతీయ నేతలకు నివాళి అర్పించారు. ముందుగా రాజ్‌ఘాట్‌ను సందర్శించి.. మహాత్మాగాంధీకి నివాళులు అర్పించారు. రాజ్‌ఘాట్ నుంచి అటల్ సదైవ్‌కు వెళ్లారు మోదీ. మాజీ ప్రధాని వాజ్‌పేయికి మోదీ నివాళులు అర్పించారు. అటల్ సదైవ్ నుంచి నేరుగా.. నేషనల్ వార్ మెమోరియల్‌కు వెళ్లారు. అమరజవాన్లకు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో మోదీతో పాటు రాజ్‌నాథ్ సింగ్, త్రివిధ దళాల అధిపతులు కూడా పాల్గొన్నారు.

# ఎదురు దెబ్బలు మంచివే!

- దూకుడుకు కళ్లెం
- సన్నగిల్లుతున్న ప్రజాదరణ
- మత విభజనకు ప్రయత్నిస్తే జరిగేది ఇదే
- బీజేపీ కార్యకర్తల మనోగతం



న్యూఢిల్లీ :లోక్సభ ఎన్నికల ఫలితాలు బీజేపీ కార్యకర్తలను తీవ్రమైన నిరాశా నిస్పృహల్లో ముంచెత్తాయి. పార్టీకి వరుసగా మూడోసారి కూడా స్పష్టమైన ఆధిక్యత లభిస్తుందని ఆశించిన నాయకులు, కార్యకర్తలు ఒక్కసారిగా డీలా పడ్డారు. ఫలితాలు వెలువడిన రోజు టీవీలు, యూట్యూట్ ఛానల్స్, సామాజిక మాధ్యమాలకు అతుక్కుపోయిన బీజేపీ శ్రేణులకు మధ్యాహ్నానికే పరిస్థితి అర్థమైపోయింది. బీజేపీ సొంతంగా 350కి పైగా స్థానాలు సాధిస్తుందని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేయడంతో పట్టరాని ఆనందంతో సంబరాలు చేసుకున్న కార్యకర్తలు వాస్తవ ఫలితాల ప్రకటనతో హతాశులయ్యారు.ఈ ఫలితాలు తాము ఊహించలేదని పలువురు కార్యకర్తలు వాపోయారు. కొందరు మాత్రం ఇది ప్రజాస్వామ్యానికి మంచి పరిణామమేనని, ప్రచారంలో చోటుచేసుకున్న పొరబాట్లపై బీజేపీకి సరైన సందేశమే అందిందని వ్యాఖ్యానించారు. హిందూ ఓట్లు గంపగుత్తగా బీజేపీకి పడలేదని సామాజిక మాధ్యమాలలో పలువురు పోస్టులు పెట్టారు. పార్టీ మెజారిటీని కోల్పోవడం మంచిదేనని ఓ కార్యకర్త వ్యాఖ్యానించారు. 'ప్రజాస్వామ్యంలో అపరిమిత అధికారాలు సంక్రమించకుండా ఇలాంటివి అడ్డుకుంటాయి' అని ఆయన చెప్పారు.2019లో గెలుచుకున్న సీట్లు లభించకపోయినా లోక్సభలో బీజేపీ కనీసం సగం స్థానాలనైనా గెలుచుకుంటుందని ఆశించానని మరో కార్యకర్త తెలిపారు. మెజారిటీ తగ్గిపోవడం ఆశ్చర్యాన్ని కలిగించిందని అంటూనే ఏ పార్టీ అయినా 400 స్థానాలు గెలుచుకోవడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని చెప్పారు. ఎన్నికలు నిస్పక్షపాతంగా జరిగాయని ఫలితాలు నిరూపించాయని మరో కార్యకర్త అన్నారు. ప్రజాభిప్రాయంలో విభజన స్పష్టంగా కన్పించిందని, బీజేపీ ప్రభుత్వ పాలనపై ప్రజలందరూ సంతోషంగా ఏమీ లేరని చెప్పారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలకు అనుకూలంగా ప్రభుత్వం విధానాలు రూపొందించుకోవాలని, నైపుణ్యాభివృద్ధిని కొనసాగించాలని సూచించారు. వ్యాపారం, పెట్టుబడులకు రాజకీయ స్థిరత్వం అవసరమని అన్నారు.పది సంవత్సరాల తర్వాత మరోసారి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడడంపై కొందరు ఆందోళన వ్యక్తం చేశారు. సంకీర్ణ ప్రభుత్వాలు దేశానికి మంచివి కావని వారు అభిప్రాయ పడ్డారు. సంకీర్ణంలోని భాగస్వామ్య పక్షాలు తమ కోసం, తమ ప్రాంతం కోసం మాత్రమే పని చేస్తాయని వారు చెప్పారు. ఉమ్మడి పౌరస్మృతి, ఇతర సంస్కరణలు ఇప్పుడు అమలు కాబోవని కొందరు తెలిపారు. ప్రజా తీర్పు బీజేపీ దూకుడుకు కళ్లెం వేసిందని కొందరు పార్టీ కార్యకర్తలు అన్నారు. పార్టీకి ఉన్న ప్రజాదరణ సన్నగిల్లుతోందని వారు అంగీకరించారు. బీజేపీ ఉత్తరా ఖండ్ మైనారిటీ ఫ్రంట్ కార్యనిర్వాహక కమిటీ సభ్యుడు మహమ్మద్ రఫీ దిండా గుజ్జర్ మాట్లాడుతూ ఈ ఫలితాలు బీజేపీకి%ొా% ముఖ్యంగా ఉత్తరప్రదేశ్లో ఎదురు దెబ్బేనని చెప్పారు.బీజేపీ ప్రభుత్వ నిర్ణయాలు, విధానాలు సమాజంలో కొన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యం కాలేదని హైదరాబాద్కు చెందిన ఆరోగ్య కార్యకర్త కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఇక ప్రతి సమాజం యొక్క అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించాల్సి ఉంటుందని అభిప్రాయపడ్డారు. దేశంలోని అన్ని ప్రాంతాలకు చెందిన పార్టీ నాయకులకు ప్రాధాన్యత ఇవ్వాలని, కేవలం గుజరాత్ నేతలకు పెద్దపీట వేస్తే సరిపోదని చురక వేశారు. క్రైస్తవ సమాజంలో బీజేపీ ఆదరణ కోల్పోయిందని చెప్పారు. కొందరు బీజేపీ నాయకులు అవలంబించిన మైనారిటీ వ్యతిరేక వైఖరి కారణంగా క్రైస్తవుల్లో అభద్రతాభావం నెలకొన్నదని అన్నారు. మత విభజనకు ప్రయత్నిస్తే ఇలాగే అవుతుందని బీజేపీకి సంకేతం అందిందని మరో కార్యకర్త వ్యాఖ్యానించారు.నాయకత్వంలో మితిమీరిన విశ్వాసం, పార్టీ ఓటర్లలో ఆత్మసంతృప్తి బీజేపీ ఓటమికి కారణమయ్యాయని కొందరు అభిప్రాయపడ్డారు. ఆర్ఎస్ఎస్కు వ్యతిరేకంగా పార్టీ నేతలు చేసిన వ్యాఖ్యలు, రాజపుత్రులను దూరం పెట్టడం వంటివి బీజేపీ పరాజయానికి దోహదపడ్డాయని హర్యానాకు చెందిన ఓ ప్రభుత్వోద్యోగి చెప్పారు. బీజేపీ నేతల దుందుడుకు వైఖరితో కొన్ని రాష్ట్రాల్లో సీట్లు తగ్గాయని ఓ కార్యకర్త విశ్లేషించారు. తన పేరుతోనే మోడీ ఎన్నికల ప్రచారం చేశారని, స్థానిక నేతలను పట్టించుకోలేదని, అందుకే యూపీలో బీజేపీ దెబ్బతిన్నదని మరొకరు చెప్పారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మధ్య తెరవెనుక విభేదాలు ఉన్నాయని, పార్టీ టిక్కెట్లు ఎవరికి ఇవ్వాలనే విషయంలో యోగి సలహాను అమిత్ పట్టించుకోలేదని కొందరు ఫిర్యాదు చేశారు.